# సాగు ఎలా..?

## విత్తనకాయలకు డబ్బుల్లేక ఇబ్బందులు




**సబ్సిడీ విత్తనాల కోసం రైతుల నిరీక్షణ**

**ప్రభుత్వ చేయూత కోసం ఎదురుచూపు**

ఎన్పీకుంట వద్ద వేరుశనగ విత్తడానికి సిద్ధం చేసిన పొలం

నంబులపూలకుంట, మే 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. అయితే చాలా మంది రైతులు విత్తన వేరుశనగ కొనుగోలుకు డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు భూములను దుక్కి దున్ని విత్తన సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంట సాగుకు చేతిలో డబ్బులుంటే తప్ప ఏ పనులు జరిగేలా లేవు. ప్రభుత్వం ప్రతిఏటా సబ్సిడీపై వేరుశనగ విత్తన కాయలతో పాటు, చిరుధాన్యాలు పంపిణీ చేసేది. అయితే ఈ ఏడాది మే నెల పూర్తి కావస్తున్నా సబ్సిడీ విత్తనకాయల ఊసే లేదని, అసలు ఈ ఏడాది పంటలు సాగు చేస్తామా అన్న ఆందోళనలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు.

**ప్రైవేట్ వ్యక్తుల వద్ద కొనుగోలు**

సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ గురించి ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడకపోవడంతో కొందరు రైతులు ప్రైవేటు వ్యక్తులు, వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేశారు. చాలా మంది పేదరైతులు సబ్సిడీ కాయల కోసం ఎదురు చూస్తున్నారు. రబీలో పండించిన వేరుశనగ కాయలను నిల్వ చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది. ప్రతిరైతు పండించిన పంటను నూర్పిడి యంత్రంతో కాయలు శుభ్రం చేయించడంతో, ప్రస్తుతం ఆకాయలు ఊజీ పడుతున్నాయి. గతంలో వేరుశనగ కాయలు కట్టెతో వాములు వేసి, కూలీలచే కాయలను విడిపించేవారు. అలాంటికాయలు ఏడాది అయినా పాడైపోకుండా బాగా ఉంటాయని రైతులంటున్నారు. నూర్పిడి యంత్రంతో సేకరించిన కాయలను విత్తనాలకు వలచడానికి ప్రయత్నింగా ఊజీ ఎక్కువగా కనిపిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పావలా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ కోసం ఎదురు చూపు**

గత కొన్నేళ్లుగా ప్రభుత్వ సహకారంతో పంట సాగు కోసం తీసుకున్న రుణాలకు రైతులు పావలా వడ్డీ మాత్రమే చెల్లించేవారు. ఈ ఏడాది ఇప్పటికీ పావలావడ్డీ జమ కాకపోవడంతో అప్పులు చేసి రైతులు బ్యాంక్‌లో రుణాలను రెన్యువల్ చేసుకుంటున్నారు. 2023-24 ఏడాదికి కరువు మండలాలుగా ప్రకటించినా నేటికి ఇన్‌పుడ్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ రాలేదు. దీంతో చేతిలో చిల్లి గవ్వ లేక సాగుకు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయం చేయడానికి రైతులకు కాడెద్దులు లేకపోవడంతో ట్రాక్టర్‌లపై ఆధారపడుతున్నారు. వీటి అద్దెలు అధికంగా ఉన్నాయి. ఎకరం పొలం దుక్కి చేయాలంటే రూ.రెండువేలు చెల్లించాల్సి వస్తోంది. భూముల్లో ఎండిపోయిన మొక్కలు, గట్లు, కంపచెట్లు తొలగించడానికి కూలీలకు డిమాండ్ అధికంగా ఉంది. దీంతో పంట పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు చేస్తున్నారు.

### రైతులూ... ఆందోళన చెందకండి

**మంత్రి సత్యకుమార్ యాదవ్**

ధర్మవరం, మే 21(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ గురించి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో విజయవాడలో చర్చించినట్లు పేర్కొన్నారు. సబ్సిడీ వేరుశనగ, కంది సరఫరాలో ఏర్పడే సమస్యలపై అచ్చెన్నాయుడును వ్యక్తిగతంగా కలిసి వివరించినట్లు వెల్లడించారు. దీంతో కొన్ని సమస్యలు పరిష్కారమయ్యా యని, పెండింగ్‌లో ఉన్న అంశాలపై అధికారులతో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామని సత్యకుమార్‌కు హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్, డీఏఓతో కూడా మాట్లాడినట్లు మంత్రి సత్యకుమార్ తెలిపారు. విత్తన వేరుశనగ కాయల కోసం వచ్చే రైతులకు అన్నిసౌకర్యాలను కల్పించాలని, నాణ్యమైన కాయలను పంపిణీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.



**50శాతం సబ్సిడీతో ఇవ్వాలి**

ప్రభుత్వం 50శాతం సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలను రైతులకు అందించాలి. ప్రతి సంవత్సరం పంటలు నష్టపోతున్నాం. ప్రభుత్వాలు ఆదుకోకపోతే, పంటలు పండించే పరిస్థితి లేదు. ప్రభుత్వాలు రైతుల సంక్షేమంపై దృష్టి సారించాల్సిన అవసరముంది. సకాలంలో వేరుశనగ కాయలు అందిస్తే, కూలీతో శుభ్రంచేయించి విత్తుకోవడానికి సిద్ధం చేసుకుంటాం.

-ప్రసాద్‌రెడ్డి, గోవిందురాజులపల్లి



**త్వరగా విత్తనకాయలు ఇవ్వాలి**

గత మూడు, నాలుగురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. భూమి బాగా తడిసింది. పొలాలను దుక్కులు చేయడానికి రైతులందరూ సిద్ధమయ్యారు. ప్రభుత్వం సబ్సిడీకాయలు అందిస్తే, ఒకవైపు సేద్యం పనులు చేస్తూ మరోవైపు విత్తనాలను శుభ్రం చేసుకునే అవకాశం ఉంటుంది. త్వరగా విత్తనకాయలు అందించాలి. ప్రభుత్వం రైతులకు రాయితీలను అందించి ఆదుకోవాలి.

-రామచంద్ర, దిన్నెమీదపల్లి



**ప్రతిపాదనలు పంపాం**

మండలానికి అవసరమైన వేరుశనగ విత్తన కాయల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. గత ఏడాది 3,300 క్వింటాళ్లు మంజూరయ్యాయి. ఈఏడాది ప్రభుత్వం మండలానికి ఎన్ని మంజూరు చేస్తుందో చూడాలి. వచ్చిన కాయల మేరకు పంపిణీకి చర్యలు తీసుకుంటాం.

- లోకేశ్వర్‌రెడ్డి, ఏఓ

# వ్యర్థానికి అర్థం

- సీఎం ఆలోచనలకు కలెక్టర్ కార్యరూపం..!
- అరటి నార ఉత్పత్తులతో సంపద సృష్టికి శ్రీకారం
- ఏడాదికి రూ.350 కోట్ల ఆర్జనే ధ్యేయంగా కార్యాచరణ
- రైతులకు అదనపు ఆదాయంగా బయోవేస్ట్
- మార్కెటింగ్ సౌకర్యం, ఎంఎస్‌ఎంఈ ద్వారా ప్రోత్సాహం



సీఎం చంద్రబాబుకు అరటి నారతో తయారు చేసిన టోపీని అందజేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

అనంతపురం, మే 21 (ఆంధ్రజ్యోతి): వ్యర్థంతో సంపద సృష్టించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు జిల్లా కలెక్టర్ కలెక్టర్ వినోద్‌కుమార్ కార్యరూపం ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలోనే అరటినారతో అందమైన వస్తువులు తయారీని ప్రోత్సహిస్తున్నారు. గతంలో పంట కోత కోసిన తర్వాత అరటి చెట్లను వృథాగా వదిలేసేవారు. అయితే అరటి నారతో టోపీ, హ్యాండ్‌బ్యాగ్‌లు, బ్యాగ్‌లు తదితర పర్యావరణ హితమైన ఉత్పత్తులను తయారు చేయించి, రైతుకు అదనపు ఆదాయం సమకూర్చేందుకు కలెక్టర్ కార్యాచరణ సిద్ధం చేశారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌లకు జిల్లా కలెక్టర్ స్వయంగా అరటి నారతో తయారు చేసిన టోపీని బహూకరించారు. ఆ టోపీ తయారీ వెనుకున్న ఉద్దేశాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. అరటి బోదెల వేస్ట్‌తో సహజ సిద్ధమైన ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా

(మిగతా 6వ పేజీలో..)

# వైద్యం పేరిట దోపిడీ

**సవీరా సహా చాలా ఆస్పత్రుల్లో దందా**

- నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి
- ఆర్డీటీని కాపాడుకునేందుకు కలిసి పోరాడుదాం
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో వీటిపైనే ప్రధాన చర్చ

7

# పదవి కోసం పట్టు..!

- పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్‌ను దింపాల్సిందే
- కష్టపడ్డ వారికే అవకాశం కల్పించాలి
- 10 నెలల పదవి కోసం ముగ్గురు కౌన్సిలర్ల పట్టు
- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట వద్ద పంచాయితీ?




పుట్టపర్తి, మే 21(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి నగర పంచాయతీలో వైసీపీ కౌన్సిలర్ల మధ్య అంతర్గత పోరు సాగుతోంది. ప్రస్తుత చైర్మన్‌కు ఉద్వాసన పలికి తమ అవకాశం కల్పించాలని వైసీపీలోని ముగ్గురు కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. చైర్మన్ పదవి వస్తుందని ఎన్నికల సమయంలో భారీగా ఖర్చుచేశామని, తీరా చూస్తే చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించడంతో మిన్నకుండి పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన ఈ 10నెలల కాలానికైనా తమకు అవకాశం కల్పించాలని ఆ ముగ్గురుకౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచినట్టు సమాచారం. అయితే ప్రస్తుత చైర్మన్ కూడా రాజీనామా చేయడానికి చేయడానికి సిద్ధంగా లేనట్లు సమాచారం. దీంతో వైసీపీలో వర్గవిభేదాలు బహిర్గతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**కష్టపడ్డాం..**

**అవకాశం కల్పించాల్సిందే**

పుట్టపర్తి నగర పంచాయతీని వైసీపీ గెలవడానికి తీవ్రంగా కష్టపడ్డాం. భారీగా ఖర్చు పెట్టుకున్నామని వైసీపీ కౌన్సిలర్లు పేర్కొంటున్నారు. వైసీపీ కన్వీనర్ మాధవరెడ్డికి మున్సిపాలిటీలో పట్టు ఉండటంతో తన శక్తి మేరకు ఆర్థికంగా సహకరిస్తూ మున్సిపాలిటీని కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడని పార్టీలో కొందరు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీని జనరల్‌కు కేటాయించడంతో ఎలాగైనా చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి తన భార్య లక్ష్మీదేవమ్మను గెలిపించుకున్నారు. మరో వైసీపీ నాయకుడు నారాయణరెడ్డి కూడా చైర్మన్ పదవిని ఆశించి తన సతీమణి లక్ష్మిని గెలిపించుకోగా ఆమెకూడా ప్రస్తుతం వైస్‌చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. బీసీ వర్గానికి చెందిన కౌన్సిలర్ సూర్యాగౌడ్ కూడా వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడుతూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తున్నారు. ఈ ముగ్గురిలో ఏ ఒక్కరికి అవకాశం కల్పించినా మిగిలినవారు సర్దుకుపోయే పరిస్థితిలో ఉన్నట్లు సమాచారం.

**రాజీనామా చేసే ప్రసక్తే లేదు**

పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు చైర్మన్ పదవిని చేపట్టా. మధ్యలో రాజీనామా చేయమంటే చేసే ప్రసక్తే లేదంటూ ప్రస్తుత చైర్మన్ తుంగా ఓబుళపతి భీష్మించినట్లు సమాచారం. తనను పదవి నుంచి దించాలనుకుంటే అవిశ్వాసం పెట్టుకోవచ్చని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా మాత్రం చేసేది లేదని చెప్పినట్లు తెలిసింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయి తీవ్ర నిరాశ నిస్పృహలో ఉన్న వైసీపీని స్థానిక సమస్యలు వేధిస్తున్నాయి. చైర్మన్‌ను రాజీనామా చేయమంటే జరిగే పరిణామాలపై కూడా వైసీపీ అధిష్టానం ఆరాతీస్తున్నట్టు సమాచారం. చైర్మన్ చేత రాజీనామా చేయించినా లేదా అవిశ్వాసం పెట్టిన అధికార టీడీపీ చైర్మన్ పదవిని లాక్కుంటుందేమోనన్న అనుమానాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. పుట్టపర్తి నగర పంచాయతీలో 20 మంది కౌన్సిలర్లు ఉండగా వైసీపీ తరఫున 14 మంది, టీడీపీ తరఫున ఆరుగురు గెలుపొందారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీకి చెందిన కౌన్సిలర్ లక్ష్మీపతి టీడీపీలోకి చేరడంతో ప్రస్తుతం టీడీపీ బలం ఏడుకి పెరిగింది. చైర్మన్‌ను దింపితే టీడీపీ ముగ్గురు కౌన్సిలర్‌లను తమ పార్టీలోకి లాక్కుంటే ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యేతో కలిసి 11 మంది అవుతారు. దీంతో సునాయాసంగా టీడీపీ చైర్మన్ పదవిని కైవసం చేసుకునే అవకాశం ఉంటుంది.

# అభివృద్ధికి చిరునామా టీడీపీ

- వైసీపీ ఐదేళ్లలో చేయని అభివృద్ధి పది నెలల్లో చూపించాం: మంత్రి సవిత
- టీడీపీకి కార్యకర్తలే మూలస్తంభాలు: బీకే
- పెనుకొండలో ఘనంగా మినీమహానాడు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి, ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

హిందూపురం, మే 21(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ చిరునామా బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండలో బుధవారం మినీమహానాడు ఘనంగా నిర్వహించారు. మొదట పెనుకొండ మండలంలోని మడకశిర సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి మంత్రి సవిత ఎంపీ పార్థసారథి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు వేలాదిగా ర్యాలీగా వెళ్లి మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఏడాదికాలంలో మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ స్కాంరెడ్డి పని అయిపోయిందని వైసీపీ హయాంలో దోచుకో దాచుకో పంచుకో అన్న సంస్కృతికి తెరలేపారన్నారు. వైసీపీ ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని తమ ప్రభుత్వం పనిని పదినెలల్లో చేసి చూపించిందన్నారు. వైసీపీ పాలనలో పెనుకొండ అస్తవ్యస్తంగా మారిందన్నారు. వలస పక్షులు ఇక్కడికి రావడం, దొరికింది దోచుకోవడం, తరువాత పారిపోవడం జరిగిందని మాజీ మంత్రులు ఉష శ్రీచరణ్, శంకర్‌నారాయణను ఉద్దేశించి అన్నారు. తాను మంత్రి అయ్యాక ప్రత్యేక ప్రణాళికతో నియోజకవర్గంలో రోడ్లు, మురుగు కాలవల నిర్మాణం, తారురోడ్లు, తాగునీటి కోసం బోర్లు వేయించినట్లు తెలిపారు.

**కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలు**

**: ఎంపీ పార్థసారథి**

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే మూల స్తంభాలని ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. మినీమహానాడుకు హాజరైన ఆయన మాట్లాడుతూ 1982లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా టీడీపీని స్థాపించి తొమ్మిది నెలల్లో నే అధికారంలోకి తెచ్చిన ఘనం దివంగత ఎన్టీఆర్‌కు దక్కుతుందన్నారు. టీడీపీ వల్ల బడుగు బలహీనవర్గాల వారికి న్యాయం చేకూరిందన్నారు. తమలాంటివారు ప్రజాప్రతినిధులయ్యారంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. పార్టీ కష్టకాలంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పార్టీకోసం నిలబడ్డ కార్యకర్తల తెగువ స్ఫూర్తిదాయకమన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా సూపర్-6 పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతర మినీమహానాడుకు హాజరైన ప్రతికార్యకర్తకు కానుకలు అందజేశారు. జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల కోసం ఆవిర్భవించింది తెలుగుదేశం పార్టీ అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నరసింహరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీగా వస్తున్న తెలుగు తమ్ముళ్లు



# జిల్లా మహానాడును జయప్రదం చేద్దాం

- మంత్రి సవిత

పుట్టపర్తిరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈనెల 24న నిర్వహించే మినీమహానాడును జయప్రదం చేయాలని బీసీ సంక్షేమశాఖామంత్రి సవిత పిలుపునిచ్చారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పార్టీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజనప్ప అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మినిమహానాడులు పూర్తి అయ్యాయని, ఈనెల 24న జిల్లాకేంద్రంలో జిల్లా స్థాయి మినీమహానాడును ఘనంగా నిర్వహిద్దామ న్నారు. కార్యక్రమానికి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. జిల్లాస్థాయి మినీమహానాడును నిర్వహించడానికి సంబంధించి జిల్లా కేంద్రంలో పోలీసు పరేడ్ గ్రౌండ్, ఏపీఐఐసీ ప్రాంతంలో స్థలపరిశీలన చేస్తున్నా మన్నారు. ఈనెల 27నుంచి 29 వరకు కడపలో జరిగే మహానాడుకు జిల్లా నుంచి పెద్దఎత్తున నాయకులు కార్యకర్తలు తరలివెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, జిల్లాకార్యదర్శి సామకోటి ఆదినారాయణ, ఎల్‌ఐసీ నరసింహులు, శ్రీరామిరెడ్డి, లాయర్ రాజశేఖర్, పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆర్వోబీ నిర్వాసితులకు త్వరగా పరిహారమివ్వండి

**ఆర్డీఓను కోరిన పరిటాల శ్రీరామ్**



ఆర్డీఓతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కదిరి గేటు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్వాసితులకు త్వరగా నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ మహేశ్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ బుధవారం కోరారు. గత వైసీపీ హయాంలో బాధితులకు పరిహారం విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరించారు. వారికి అనుకూలమైన వారికి పరిహారం ఎక్కువ అందేలా.. మిగిలిన వారికి తక్కువ అందేలా నివేదికలు తయారు చేశారు. దీంతో నాడు బాధితులు ఆందోళన చేపట్టగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే బాధితులందరికీ సమన్యాయం చేస్తామని పరిటాల శ్రీరామ్ భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్డీఓ మహేశ్ సహకారంతో మళ్లీ నివేదికలు పంపారు. అంతేకాకుండా మంత్రులు, ప్రభుత్వంతో మాట్లాడి గతంలో కన్నా ఒక్కొక్క సెంట్‌కు అదనంగా రూ.4.50 లక్షలు అదనంగా బాధితులకు పరిహారం అందేలా చేశారు. ఆ పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని పరిటాల శ్రీరామ్ బుధవారం ఆర్డీఓను కోరారు.

## తేలికపాటి వర్షం

పుట్టపర్తి రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం రాత్రి పలుచోట్ల తేలికపాటి వర్షం కురిసింది, అత్యధికంగా గోరంట్ల 48.2 మి.మీ వర్షం కురిసింది. అత్యల్పంగా రొద్దంలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. నల్లచెరువు 45.2 మి.మీ, ఓబులదేవరచెరువు 44.2 మి.మీ, కనగానపల్లి 24.2 మిమీ, నంబులపూలకుంట 24.2 మి.మీ, సోమందేపల్లి 21.4 మి.మీ, అమడగూరు 16.4 మి.మీ, పెనుకొండ 14.0 మి.మీ, కొత్తచెరువు 12.8 మి.మీ, పుట్టపర్తి 10.6 మి.మీ, గాండ్లపెంట 9.6 మి.మీ, బత్తలపల్లి 8.2 మి.మీ, తలుపుల 4.2 మి.మీ, కదిరి 4.0 మి.మీ, తనకల్లు 3.6 మి.మీ, ధర్మవరంలో 3.4 మి.మీ, బుక్కపట్నం 3.4 మి.మీ, రామగిరి 3.2 మి.మీ, చిలమత్తూరు 2.8 మి.మీ, చెన్నేకొత్తపల్లి 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

## చిన్నారిపై అత్యాచారయత్నం

- కామాంధుడికి దేహశుద్ధి



మహిళల చేతిలో తన్నులు తిన్న నరసింహమూర్తి

హిందూపురం, మే 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తూమకుంట చెక్‌పోస్టు సమీపంలో తొమ్మిదేళ్ల చిన్నారిపై నరసింహమూర్తి(45) అనే వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. పారిశ్రామికవాడ సమీపంలో తన ఇంటివద్ద ఆడుకుంటున్న బాలికను నిందితుడు బుధవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో లాక్కెళ్లి దుస్తులు విప్పుతుండగా సమీపంలో ఉన్న ఓ మహిళ గమనించి కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కలవారు వచ్చేసరికి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. వారు వెంబడించి పట్టుకుని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని నరసింహమూర్తిని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ మహేష్ తెలిపారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో ఓ చిన్నారిని 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసి హత్య చేశాడు. మృతదేహాన్ని నదీ పరివాహక ప్రాంతంలో పూడ్చాడు. మరోమారు అత్యాచారయత్నం జరగడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పాడికి ప్రోత్సాహమేదీ..?

తగ్గిన పాల ధరలు... నష్టపోతున్నామని రైతుల ఆందోళన



అమడగూరు (కదిరి), మే 21 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. పాలధరలు తరచూ నష్టాలే వస్తుండటంతో చాలా మంది రైతులు పాడివైపు మళ్లారు. పశుపోషణతోనే జీవనం సాగిస్తూ పిల్లలను చదివించుకుంటున్నారు. జీవనానికి భరోసా దొరికినా, పాలకు గిట్టుబాటు ధర రావడంలేదని పలువురు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే డెయిరీలు మూతపడ్డాయి. దీంతో పాడిరైతులు పాలను అమ్ముకోవాలంటే ప్రైవేటు డెయిరీలను ఆశ్రయించక తప్పడంలేదు. దీంతో ప్రైవేటు నిర్వాహకులు ఇచ్చిన ధరనే రైతులు తీసుకోవాల్సి వస్తోంది.

| పాడి పశువుల వివరాలు.. | | |
|---|---|---|
| పంచాయతీలు | ఆవులు | గేదెలు |
| అమడగూరు | 770 | 52 |
| జేకేపల్లి | 507 | 80 |
| తుమ్మల | 1,181 | 51 |
| చినగానిపల్లి | 1,468 | 74 |
| మహమ్మదాబాద్ | 491 | 56 |
| పూలకుంటపల్లి | 467 | 06 |
| గుండువారిపల్లి | 113 | 10 |
| చీకిరేవులపల్లి | 122 | 03 |
| కసముద్రం | 284 | 14 |
| మొత్తం | 5,403 | 346 |

రూ.38నుంచి 40వరకు ఉండేది. ప్రస్తుతం లీటరుకు రూ.34మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మండల కేంద్రాల్లో ఏపీ డెయిరీ ఆధ్వర్యంలో పాలను సేకరించేవారు. ప్రస్తుతం వాటిని పునఃప్రారంభించి, పాడిరైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### తగ్గిన పాలధరలతో ఇబ్బందులు

ప్రస్తుతం పాలసేకరణ కేంద్రాలు నిర్వహించకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డెయిరీలు పెరిగినా, పాడి రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. పాలధరలు బాగా తగ్గించారు. గతంలో లీటర్ పాల ధర

### ధరలు లేవు



నా వద్ద ఐదు పాడి ఆవులు ఉన్నాయి. ఆవులకు కావలసిన గడ్డిని ఒక ఎకరాలో సాగుచేశా. పాడిపైనే జీవనం. ఒకపూటకు 20లీటర్ల పాలు డెయిరీకి పోస్తున్నా. గతంతో పోల్చితే ఈ ఏడాది పాల ధరలు తగ్గాయి. పాలధరలు గతంలోలాగా వస్తే జీవనోపాధికి ఢోకా ఉండదు.

-మంజునాథ్, పాడిరైతు, కొక్కంటివారిపల్లి

# గాడితప్పిన రెవెన్యూ పాలన

అందుబాటులో ఉండని సిబ్బంది కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు



బొమ్మనహాళ్ తహసీల్దార్ కార్యాలయం

బొమ్మనహాళ్, మే 21(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పాలన గాడితప్పడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ పని కావాలన్నా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాల్సి ఉంది. రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్‌కు డీ హీరేహాళ్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఇక్కడ సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చేవారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో వెనుదిరుగుతున్నారు. తమ భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్ నమోదు చేశారని కొందరు రైతులు నెలల తరబడి తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ప్రస్తుతం రైతులు బ్యాంకు రుణాలు రెన్యువల్ కోసం రెవెన్యూ కార్యాలయానికి వస్తుంటారు. కొన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బంది అందుబాటులో ఉండట్లేదు. తాము ఎక్కడుంటే అక్కడికే రావాలని వారు చెబుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది అందుబాటులో ఉంటే. తహసీల్దార్ ఉండరు. తహసీల్దార్ సంతకం కోసం ఆలస్యం అవుతోందని రైతులు వాపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు తప్పించి, తమ సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### ఆరు నెలలుగా తిరుగుతున్నా



సింగానహళ్లి పొలం 119, 128, 132బి, 132సి సర్వే నంబర్లలో ఎకరా భూమి ఉంది. అందుకు సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, ఆడంగల్, 1బీ ఆన్‌లైన్‌లో నా పేరునే ఉన్నాయి. ఆరు నెలల క్రితం ఆన్‌లైన్‌లో 0.60 ఎకరా భూమిని తొలగించారు. ఆ భూమిని మరొకరి పేరుపై ఆన్‌లైన్‌లో ఎక్కించారు. దీని కోసం ఆరు నెలలుగా తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు నా పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయం చేయాలి.

-కెంచప్ప, రైతు, సింగానహళ్లి

### సిబ్బంది కొరత ఉంది



రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. ఆర్.ఐ, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ లేరు. ఉన్నవారితో పని చేస్తున్నాం. రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తున్నాం. కొన్ని ఆలస్యం చేస్తున్నాం. వాటిని పరిష్కరిస్తున్నాం. రైతులు నేరుగా నన్ను కలిసి సమస్యలు పరిష్కరించుకోవచ్చు.

-మునివేలు, తహసీల్దార్, బొమ్మనహాళ్

# 99.6 శాతం పాస్

డిగ్రీ మెగా సప్లిమెంటరీ ఫలితాలు అదుర్స్

పరీక్షలు రాసిన 3,665 మంది విద్యార్థులు

16మంది మాత్రమే ఫెయిల్

ఫలితాలు విడుదల చేసిన ఎస్కేయూ వీసీ అనిత



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు తదితరులు

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ మెగా సప్లిమెంటరీ పరీక్షల్లో 99.6 శాతమంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ అనిత, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబుతో కలిసి బుధవారం ఫలితాలు విడుదల చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ.. డిగ్రీలో సెమిస్టర్ విధానానికి ముందు ఇయర్‌వైజ్ పరీక్షలు నిర్వహించేవారన్నారు. వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు సప్లిమెంటరీ నిర్వహించలేదన్నారు. దీంతో వేలాదిమంది విద్యార్థులు డిగ్రీ పూర్తిచేయక ఉద్యోగాలు పొందలేక, పోటీ పరీక్షలకు అర్హతలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో 1994 నుంచి 2015 వరకు డిగ్రీ బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ వార్షిక పరీక్ష విధానంలో ఫెయిలైన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ నిర్వహించామన్నారు. మొత్తం 3,655 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 3,639 మంది పాస్ అయినట్లు తెలిపారు. 16మంది విద్యార్థులు మాత్రమే ఫెయిల్ అయ్యారన్నారు. మొత్తం 99.6 శాతం ఉత్తీర్ణత వచ్చిందని వివరించారు. ఫలితాలను మనబడి, స్కూల్స్9 వెబ్‌పోర్టల్‌లో ప్రదర్శించామన్నారు. ఫెయిలైన విద్యార్థులు రీవెరిఫికేషన్ కోసం పేపర్‌కు రూ.500 చొప్పున ఈనెల 22 నుంచి చెల్లించాలని సూచించారు. డిగ్రీ హానర్ ప్రథమ సెమిస్టర్ పరీక్షల్లో 8,265 మంది విద్యార్థులుగాను 4,739 మంది పాస్ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ సంచాలకుడు ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ డాక్టర్ లోకేష్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ రామగోపాల్, అధికారులు సాయిశివ, మారుతి పాల్గొన్నారు.

# గోకులం కట్టి.. పాడినే అమ్ముకున్నాడు..!

అప్పు చేసి.. షెడ్డు నిర్మాణం

వెంటనే బిల్లులిస్తామని అధికారుల హామీ

నెలలైనా అందించని వైనం

పాడిని అమ్మి.. రుణం చెల్లించిన రైతు



నగరూరులో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

యాడికి, మే 21(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తయి ఏడునెలలైనా నేటికీ బిల్లులు అందక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పాడిరైతుల సంక్షేమం కోసం గోకులాలను ఏర్పాటు చేసింది. మండలవ్యాప్తంగా 32 మంది పాడిరైతులు గోకులాలను నిర్మించుకున్నారు. ఒక్కో గోకులం షెడ్డు నిర్మాణానికి రూ.2.70 లక్షలు బిల్లులు మంజూరు కావాల్సిఉంది. మండలవ్యాప్తంగా రూ.66.24 లక్షలు చెల్లించాల్సి ఉంది. గోకులాల నిర్మాణ సమయంలో బిల్లులకు ఢోకా లేదని, పనులు పూర్తి చేయడమే ఆలస్యం, వెంటనే చెల్లిస్తామని అధికారులు చెప్పారని లబ్ధిదారులు తెలిపారు. దీంతో అప్పులు చేసి షెడ్లను నిర్మించుకున్నామని పాడిరైతులు తెలిపారు. సంక్రాంతి పండుగరోజు అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా గోకులాలను ప్రారంభించి ఫొటోలకు ఫోజులిచ్చారని, బిల్లుల విషయం మాత్రం పట్టించుకోవట్లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని అధికారులు చెబుతున్నారని వారు వాపోతున్నారు. వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో వడ్డీకి అప్పులు తెచ్చి గోకులాలు నిర్మించామనీ, ఇప్పుడు అధికారులు చేతులెత్తేస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని, గోకులం షెడ్ల బిల్లులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

**యాడికి** మండలంలోని ఓ గ్రామానికి చెందిన పాడి రైతు రెండు గేదెలను మేపుతుండేవాడు. వాటి పాలు అమ్మి, జీవనం సాగిస్తుండేవాడు. గోకులం షెడ్డు కట్టుకోవాలని, నిర్మాణం అలా పూర్తవగానే.. ఇలా.. బిల్లులు చెల్లిస్తామని అధికారులు నమ్మబలికారు. జీవనాధారమైన పాడి పశువులకు నీడ ఏర్పాటు చేయడం మంచిదే కదా అనుకున్నాడు రైతు. తన వద్ద డబ్బు లేకున్నా.. ఇతరుల వద్ద రూ.2 లక్షలకు పైగా అప్పు తెచ్చి, గోకులం షెడ్డు కట్టుకున్నాడు. నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులు వెంటపడ్డారు. షెడ్డు నిర్మాణం పూర్తవగానే దాని వద్ద అధికారులు ఫొటోలు దిగారు. వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. నెలలు గడుస్తున్నా.. మంజూరు చేయలేదు. బిల్లులు అడిగితే ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో పాడి రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. బిల్లులు వస్తే కట్టుకుందామని అప్పులు తెచ్చి, షెడ్డు నిర్మించుకున్నాడు. బిల్లులు రాక అయోమయంలో పడ్డాడు. అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేశారు. ఏ మార్గమూలేక పాడి పశువులనే అమ్మేసి, అప్పు కట్టాడు. అలా.. అధికారుల నిర్వాకంతో ఏ పాడి పశువుల కోసమైతే గోకులం షెడ్డు కట్టాడో.. అందుకు చేసిన అప్పు తీర్చేందుకు వాటినే అమ్ముకోవాల్సి వచ్చింది. పాపం.. జీవనాధారం కోల్పోయాడు పాడి రైతు.

### వెంటనే బిల్లులు చెల్లిస్తామంటేనే షెడ్డు కట్టుకున్నా



గోకులం షెడ్డను కట్టుకునేది ఆలస్యం వెంటనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు నమ్మబలకడంతో అప్పుచేసి పనులు వేగవంతంగా పూర్తిచేశా. సంక్రాంతి పండుగ రోజు అధికారులు, ప్రజాప్రతినిధులు వచ్చి ఆర్భాటంగా ప్రారంభించారు. నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరుకాలేదు. గోకులం బిల్లులు వెంటనే మంజూరు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

-వేణు, పాడిరైతు, నగరూరు గ్రామం

### ఒత్తిడి చేసి.. పనులు పూర్తి చేయించారు..



గోకులం షెడ్డు కట్టేటపుడు అధికారులు వెంటపడి పనులు పూర్తి చేయించారు. నిర్మాణ సమయంలో డబ్బులేక అప్పు చేయాల్సి వచ్చింది. పనులు పూర్తయి ఐదునెలలవుతున్నా ఇంతవరకు బిల్లులు చెల్లించలేదు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గోకులం షెడ్ల బిల్లులు వెంటనే మంజూరు చేయాలి.

-లోకేశ్, పాడిరైతు, పిన్నేపల్లి

### నిధులు మంజూరు కావాల్సి ఉంది



మండలంలో 32 గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటికి సంబంధించి బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. నిధులు రాగానే బిల్లులు చెల్లిస్తాం.

-మద్దిలేటి, ఏపీఓ, యాడికి మండలం


# వ్యర్థానికి అర్థం

(ఐదోపేజీ తరువాయి)

రైతుకు కలిగే ఆర్థిక ప్రయోజనాలను వారికి కలెక్టర్ వివరించారు. ఈ వినూత్న ఆలోచనకు గవర్నర్, సీఎం, మంత్రుల నుంచి కలెక్టర్‌కు ప్రశంసలు అందాయి.

### హార్టికల్చర్ కాంక్లేవ్‌తో ఆలోచన

జిల్లాలో 12వేల హెక్టార్లలో అరటి పంట సాగవుతోంది. పంట కోత తర్వాత బయోవేస్ట్‌ను వినియోగించడం ద్వారా పర్యావరణ హితమైన పద్ధతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ఆలోచించారు. జిల్లా కేంద్రంలో ఇటీవల అనంత హార్టికల్చర్ కాంక్లేవ్ నిర్వహణ ద్వారా జాతీయ స్థాయిలో ఒక గుర్తింపు వచ్చింది. హార్టికల్చర్ కాంక్లేవ్ తర్వాత ఆయన మదిలో మెదిలిన ఆలోచనతోనే అరటినారతో టోపీలు, బ్యాగ్‌లు, డెకొరేటివ్ ఉత్పత్తుల తయారీ కోసం జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.





అరటి నారతో తయారు చేసిన టోపీ, బ్యాగ్



మంత్రి నారా లోకేశ్‌కు అరటి నారతో తయారు చేసిన బ్యాగ్‌ను అందజేస్తున్న కలెక్టర్ (ఫైల్)

### స్వయం ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమ

అరటి నారతో టోపీలు, బ్యాగ్‌లు తదితర అందమైన వస్తువుల తయారీని కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు జిల్లా యంత్రాంగం సంకల్పించింది. డీఆర్‌డీఏ, వెలుగు, గ్రామైక్య సంఘాలు, మెప్మా స్వయంసహాయక సంఘాలు, నిరుద్యోగ యువత, ఎంఎస్ఎంఈ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ద్వారా అరటినారతో అందమైన వస్తువులను తయారుచేయించి, మార్కెటింగ్ చేసేవిధంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ రూపొందిస్తోంది. తద్వారా కరువు జిల్లా రైతాంగానికి అదనపు ఆదాయం, నిరుద్యోగ మహిళలు, యువతకు స్వయం ఉపాధి కల్పించే కుటీర పరిశ్రమగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ వినూత్న ఆలోచనకు కలెక్టర్ శ్రీకారం చుట్టారు.

### కలెక్టర్ ఏమంటున్నారంటే..!

వ్యర్థమైన అరటిబోదెలతో పర్యావరణ హితమైన ఉత్పత్తులు తయారు చేసి రైతు, మహిళలు, యువత, పారిశ్రామిక ఔత్సాహికులకు ఆదాయం చేకూర్చాలనే ఆలోచనపై 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ఆ మేరకు జిల్లా యంత్రాంగానికి అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌తో వచ్చిన ఆలోచననే ప్రస్తుతం జిల్లాలో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం. అందులో భాగంగానే అరటి నారతో టోపీలు, బ్యాగ్‌లు, షర్టులు, చీరలు, పర్సులు, డెకొరేటివ్ ఉత్పత్తులు, గిఫ్ట్ బాక్సులు తయారు చేసి స్థానిక, దేశీయ మార్కెట్లలోకి తీసుకువెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకే గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళా సంఘాలకు, పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించడంతోపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం. అరటి నార ఉత్పత్తుల తయారీని జిల్లాలో ఒక కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం.

### 12వేల హెక్టార్లలో అరటి సాగు

జిల్లాలో 12వేల హెక్టార్లలో అరటి సాగవుతోంది. పంట విస్తీర్ణం పెంచడంతోపాటు అరటి గెలల కోత తర్వాత ఏడాదికి సుమారు 7.2 లక్షల టన్నుల అరటి బయోమాస్ వేస్ట్ ఉంటోంది. ఒక టన్ను బయోమాస్ వేస్ట్ ద్వారా దాదాపు 20 కేజీల అరటి నారను తయారు చేయవచ్చు. ఈ విధంగా ఏడాదికి 14వేల టన్నులకుపైగా అరటినారను జిల్లాలో తయారు చేయవచ్చు. ఈ అరటి నారను ఉపయోగించి, 7 కోట్ల అందమైన టోపీలు, బ్యాగ్‌లు, ఇతర విలువైన వస్తువులను తయారు చేయవచ్చు. తద్వారా రైతులు, మహిళలు, గ్రామీణ యువతకు ఏడాదికి రూ.350 కోట్ల అదనపు ఆదాయ వనరులు కల్పించవచ్చు. అరటి నార ఉత్పత్తుల తయారీ కుటీర పరిశ్రమను రూ.2 లక్షల పెట్టుబడితో ఎవరైనా ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేయవచ్చు. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలతో సెమీ ఆటోమేటిక్, రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షలతో పుల్లీ ఆటోమేటిక్ పరిశ్రమను ఏర్పాటు చేసి ఏడాదికి 25 శాతం దాకా లాభాలు ఆర్జించవచ్చు. అరటి నార ఉత్పత్తుల తయారీకి ముందుకు వచ్చేవారికి ప్రభుత్వం ఆగ్రో పరిశ్రమ, ఎంఎస్ఎంఈలకు ఇచ్చే రాయితీలను వర్తింపజేస్తోంది. జాప్యంలేకుండా అన్ని అనుమతులు మంజూరు చేస్తాం. అరటి నార ఉత్పత్తుల తయారీకి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని కలెక్టర్ కోరారు.

# చీనీ @ రూ.50వేలు

యల్లనూరు, మే21(ఆంధ్రజ్యోతి): చీనీ ధరలు రైతుల్లో ఉత్సాహం నింపుతున్నాయి. వారం క్రితం వరకు నేలచూపులు చూసిన చీనీ ధరలు ఒక్కసారిగా స్వీడందుకున్నాయి. టన్ను ఏకంగా రూ.50వేల ధర పలుకుతోంది. కాయ నాణ్యతను బట్టి అంతకు టే ఎక్కువ రేటు పెట్టేందుకు కూడా వ్యాపారులు ముందుకొస్తున్నారని రైతులు చెబుతున్నారు. మండలంలోని పాతపల్లి, వెన్నపూసపల్లి, గడ్డంవారిపల్లి, యల్లనూరు, పెద్దమల్లేపల్లి, దుగ్గుపల్లి, వెంకటాంపల్లి పరిధిలో చీనీ ఎక్కువగా సాగు చేస్తున్నారు.వారంరోజుల క్రితం వరకు రూ.20వేల నుంచి 30వేల వరకు ఉన్న ధర పెరుగుతూ పోతోంది. ధరలు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలు

గుంతకల్లు, మే21(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బెంగళూరు-బీదర్ (వయా గుంతకల్లు) మధ్య ఆరు ట్రిప్పుల ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (నం.06589) ప్రత్యేక రైలు ఈనెల 22, 24, 26 తేదీల్లో బెంగళూరు నుంచి రాత్రి 9.15 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.15 గంటలకు బీదర్‌కు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణపు రైలు (నం.06590) ఈ నెల 23, 25, 27 తేదీల్లో బీదర్ స్టేషన్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 3 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, శంషాబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు.

### దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖాధికారి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రథమ సంవత్సరంలోనూ, ఇంటర్మీడియట్ (ఎంపీసీ), రెండు సంవత్సరాల ఐటీఐ కోర్సులు పాస్ అయిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సరంలోనూ ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ప్రవేశాలు పొందిన వారికి నెలకు రూ.2500 స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి టెక్స్‌టైల్ పారిశ్రామిక వేత్తలుగా, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, ప్రభుత్వ ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. టీటీకే ద్వితీయ సంవత్సరంలో నేరుగా చేరవచ్చన్నారు. దేశవ్యాప్తంగా హ్యాండ్‌లూమ్ ఇన్‌స్టిట్యూట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. వివరాలకు 9866169 908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని కోరారు. www.iihtvgr.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

### ప్రతిభా పురస్కారాలకు...

అనంతపురం క్లాక్‌టవర్, మే 21(ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కులమతాలకు అతీతంగా ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు ఏపీఎస్ఎఫ్, ఇన్‌స్పైర్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల రాఘవేంద్ర తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్థానిక కోర్టురోడ్డులోని ఏపీఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 550, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులు ఇన్‌స్పైర్ ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9985012181, 8885012181, 7730814646 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# అంజనీపుత్రా.. అభయప్రదాతా..

నేడు హనుమజ్జయంతి

వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

అనంతపురం కల్చరల్, మే 21(ఆంధ్రజ్యోతి): అంజనీపుత్రుడు, శ్రీరామచంద్రుడి పరమ భక్తుడైన హనుమంతుడి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. హనుమజ్జయంతి రోజున ఆలయాలకు వెళ్లి పావననుతుడికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు, పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ రోజున పలుచోట్ల అన్నదానాలు చేస్తే.. మరికొందరు ఉపవాసాలుండి హనుమంతుడిని ఆరాధిస్తుంటారు. హనుమజ్జయంతి వేడుకలకు జిల్లాలోని ఆంజనేయస్వామి ఆలయాలన్నీ సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డులో వెలసిన భక్తాంజనేయస్వామి, నగరశివారు రామ్‌నగర్ లోని ఆంజనేయస్వామి, మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, రెవెన్యూ కాలనీ రామాలయం, మారుతీనగర్‌లోని పంచముఖాంజనేయస్వామి, పాతూరు వ్యాసరాయాల ఆవరణలోని మూలాంజనేయస్వామి, కోర్టురోడ్డులోని వరదాంజనేయస్వామి, పాతూరు మార్కెట్‌వద్ద గల మండి ఆంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. హౌసింగ్‌బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నుంచే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండోరోజు బుధవారం భక్తాంజనేయస్వామి మూలవిరాట్‌కు పలువురు మృత్తాభిషేకాలు చేశారు. సాయంత్రం వరకూ ఆలయ ఆవరణలో భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు.



హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న భక్తులు





విద్యుద్దీపాలంకరణలో హౌసింగ్ బోర్డు భక్తాంజనేయస్వామి దేవాలయం



విశేష అలంకరణలో భక్తాంజనేయ స్వామి

# వైద్యం పేరిట దోపిడీ

## సవీరా సహా చాలా ఆస్పత్రుల్లో దందా

- నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలి
- ఆర్డీటీని కాపాడుకునేందుకు కలిసి పోరాడుదాం
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో వీటిపైనే ప్రధాన చర్చ
- ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ కోసం ఏకగ్రీవ తీర్మానం
- చైర్‌పర్సన్ చాంబర్‌లో జగన్ ఫొటోపై ఎమ్మెల్యేల అసహనం

అనంతపురం విద్య, మే 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు ప్రజలను నిలువునా దోచుకుంటున్నాయని, వాటిని నియంత్రించాలని జడ్పీటీసీలు, ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. సవీరా ఆసుపత్రి దోపిడీని అరికట్టాలని అన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ విషయంలో సభ్యులు ఏకతాటిపైకి వచ్చి, పోరాడాలని నిర్ణయించారు. ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆర్డీటీ ఆసుపత్రులు సమస్యల్లో ఉన్నందున డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ అప్రమత్తంగా ఉండాలని, అక్కడి నుంచి వచ్చే కేసులను వెంటనే టేకప్ చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. జడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ చాంబర్‌లో జగన్ ఫొటో పెట్టుకోవం, సీఎం చంద్రబాబు ఫొటోకు ప్రాధా న్యం లేకపోవడంపై ఎమ్మెల్యేలు రాజు, దగ్గుబాటి, అమిలినేని మండిపడ్డారు. ప్రజలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చ లేకుండా.. ఇలా జడ్పీ సర్వసభ్య సమావేశం బుధవారం రెండు గంటల్లో మమ అనిపించారు.

### వైద్యంపై చర్చ

సభలో మొదట వైద్య శాఖపై చర్చ జరిగింది. ఆరోగ్యశ్రీ డబ్బులు వేయిస్తామంటూ సైబర్ నేరగాళ్లు ప్రజలకు వలవేస్తున్నారని, దీన్ని నివారించాలని బుక్కరాయసముద్రం జడ్పీటీసీ కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే వైద్యం అందేలా జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ లేదని, వెంటనే ఏర్పాటు చేయాలని విడపనకల్లు జడ్పీటీసీ కోరారు. దీనిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని మడకశిర ఎమ్మెల్యే రాజు అధికారులకు సూచించారు. జిల్లా ఆసుపత్రిలో డాక్టర్లు, మందుల కొరత ఉందని అనంతపురం రూరల్ జడ్పీటీసీ అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, అన్ని కేసులు కర్నూలు, తిరుపతి, బెంగళూరు రెఫర్ చేస్తున్నారని, అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. వైసీపీ హయాంలో అధ్వానంగా ఉండేదని, తమ ప్రభుత్వం వచ్చాక తాను తరచూ విజిట్ చేస్తున్నానని, ఆసుపత్రి మెరుగుపడిందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి అన్నారు. ఓపీకి రోజుకు 2500 మంది వరకూ రోగులు వస్తున్నారని, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. సూపరింటెండెంట్ తరచూ రాత్రిళ్లు విజిట్ చేయాలని, వార్డులు, నర్సుల పనితీరు పరిశీలించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. వీటీపీ తండా ఆసుపత్రిలో డాక్టర్ల కొరత గురించి సభ దృష్టికి ఐదుసార్లు తెచ్చినా పట్టించుకోవడం లేదని వజ్రకరూరు ఎంపీపీ అన్నారు. కుక్కకాటుకు మందు దొరకడం లేదని అన్నారు. దీంతో 'డాక్టర్లను ఇస్తారా ఇవ్వరా..? ఎన్నిసార్లు అడగాలి?' అని జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. శెట్టూరు పీహెచ్‌సీలో సిబ్బంది అసలు ఉండటం లేదని ఆ మండల జడ్పీటీసీ అన్నారు. సభలో ఫొటోలు చూపించారు.



వేదికపై జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, శ్రీసత్యసాయి జిల్లా జేసీ

### దోపిడీని ఆపండి..

అనంతపురంలో సవీరా ఆసుపత్రిలో దోపిడీ పెరిగిందని, ప్రాణం మీదకు వచ్చిందని బెదిరించి వేలాది రూపాయలు దోచేస్తున్నారని శెట్టూరు జడ్పీటీసీ సభ దృష్టికి తెచ్చారు. చాలా ప్రైవేట్ ఆసుపత్రుల్లో దోపిడీ ఎక్కువైందని, అరికట్టాలని కోరారు. జడ్పీటీసీ చెప్పింది వాస్తవమేనని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు అన్నారు. 'కొన్ని రోజులు ఉంచుకుంటారు. ఏం ట్రీట్‌మెంట్ ఇస్తున్నారో ఎవరికీ తెలియదు. రోగులను సవీరా ఆసుపత్రికి రెఫర్ చేయడం ప్లాన్ ప్రకారం జరుగుతోంది. గడ ఐదేళ్లలో ఇదే తంతు జరిగింది. ఇలాంటివి కట్టడి చేయాలి' అని కోరారు. కళ్యాణదుర్గం, బత్తలపల్లి, కణేకల్లు ఆర్డీటీ ఆసుపత్రులు మూతపడే పరిస్థితి ఉందని కంబదూరు జడ్పీటీసీ అన్నారు. ఆత్మకూరు ఎంపీపీ స్థానిక పీహెచ్‌సీ సమస్యలను, వైస్ చైర్మన్ సైతం నార్పల పీహెచ్‌సీ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. శెట్టూరు పీహెచ్‌సీలో సిబ్బంది నిర్లక్ష్యం గురించి విచారించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సవీరా ఆసుపత్రిపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గైనకాలజిస్టులు, స్పెషలిస్టు డాక్టర్ల కొరత ఉందని, అర్హులు దరఖాస్తు చేసుకుంటే ఇంటర్వ్యూలు చేసి ఉద్యోగం ఇస్తామని కలెక్టర్ ప్రకటించారు.



హాజరైన సభ్యులు

### ఆర్డీటీని కాపాడుకుందాం..

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరించాలని కోరుతూ సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. కొందరు జడ్పీటీసీలు ఆర్డీటీ సేవలను ప్రస్తావిస్తూ, ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేసేలా అండగా నిలవాలని సభను కోరారు. దీనికి కళ్యాణదుర్గం ఎమ్మెల్యే స్పందిస్తూ, 2023లోనే ఈ సమస్య ఉత్పన్నమైందని అఅన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు 2024లో లేఖ రాశామని అన్నారు. ఆర్డీటీని నిలబెట్టుకునేలా అందరూ అడుగేయాలని కోరారు. సభ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపుతామని జడ్పీ చైర్‌పర్సన్ ప్రకటించారు.

- ఉపాధి పనుల్లో అక్రమాలను కొందరు జడ్పీటీసీలు లేవనెత్తారు. పనిచేసిన కూలీలకు రెట్టింపు సంఖ్యలో రికార్డుల్లో నమోదు చేస్తున్నారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని కొందరు జడ్పీటీసీలు కలెక్టర్‌ను కోరారు. భూమి చుక్కల్లో ఉన్నా, రైతులు సాగులో ఉంటే అడంగల్ ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్డీటీ సమస్య, ప్రైవేటు ఆస్పత్రుల్లో దోపిడీ మినహా పెద్దగా చర్చలు సాగలేదు. సమావేశానికి మెజార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మండలి సభ్యులు గైర్హాజరయ్యారు. జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## జగన్ ఫొటో తీసేయండి..!

జడ్పీ చైర్‌పర్సన్ చాంబర్‌లో వైసీపీ అధినేత జగన్ ఫొటో కనిపించడంతో టీడీపీ ఎమ్మెల్యేలు ఫైర్ అయ్యారు. అధికారులకు చెప్పి వెంటనే జగన్ ఫొటో తీసేయించారు. సీఈఓ రామచంద్రారెడ్డిని చైర్‌పర్సన్ చాంబర్‌కు పిలిచి... ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, దగ్గుపాటి, అమిలినేని నిలదీశారు. 'మీరు సీఈఓ నేనా..? జగన్ ఫొటో పెటొచ్చా..? సీఎం చంద్రబాబు ఫొటోను రెస్ట్ రూం వద్ద పెడతారా?' అని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో సైతం పెట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ఫొటో తీసేయాలని చైర్‌పర్సన్‌కు తాము చెప్పామని, వెంటనే తీసేయిస్తామని సీఈఓ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతో 'జడ్పీ చైర్‌పర్సన్ అయితే.. జగన్ ఫొటోను తన ఇంట్లోలో లేదా పూజ గదిలోనూ పెట్టుకోమనండి.. మాకు అభ్యంతరం లేదు' అంటూ సీఈఓపై అసహనం వ్యక్తం చేశారు. చైర్‌పర్సన్ చాంబర్ నుంచి జగన్ ఫొటో తీసేయించారు. సీఎం చంద్రబాబు ఫొటోను జడ్పీ చైర్‌పర్సన్ కుర్చీ వద్ద గోడపై పెట్టించారు.



సీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు

---

క్రైం కార్నర్

## దొంగ చేతికి తాళం..!



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

గుంతకల్లుటౌన్, మే21(ఆంధ్రజ్యోతి): బయటకు వెళ్లేటపుడు ఇంటికి తాళం వేస్తుంటారు. కొంతమంది మాత్రం తాళం చెవిని డోర్ వద్దో, కిటికీలోనో, బాక్సు కిందో ఉంచి వెళ్తుంటారు. కుటుంబంలోని మరికొందరు ఇంటికి వచ్చే అవకాశం ఉంటే ఇలా చేస్తుంటారు. ఇది సరికాదు. ఇలా చేయడం ద్వారా దొంగ చేతికి తాళం ఇచ్చినట్లే. ఇందుకు నిదర్శనమే గుంతకల్లులో జరిగిన చోరీ. పట్టణంలోని జగ్జీవన్ రామ్ కాలనీలో ఫక్రువలి కుటుంబం నివాసం ఉంటోంది. ఈనెల 17వ తేదీన ఫక్రువలి ఉదయం చెరకు బండికి, అతడి భార్య బషీరున్నీషా చర్చి స్కూల్‌లో పనికెళ్లారు. వారి ఇద్దరు కుమారులు కూడా పనులకెళ్లారు. వారి కోడలు, కూతురు ఇంట్లో ఉన్నారు. ఫక్రువలి మనవడికి టీకా వేయించేందుకు అతడి కోడలు, కూతురు ప్రభుత్వాస్పత్రికెళ్లారు. ఇంటికి తాళం వేసి, అందుకు సంబంధించిన తాళం చెవిని కిటికీ వద్దనున్న డబ్బా కింద పెట్టి వెళ్లారు. కుటుంబికులు ఎవరైనా ఇంటికొస్తే తాళం తీసుకునే అవకాశం ఉంటుందనుకున్నారు. అదే.. దొంగకు గోల్డెన్ చాన్స్ అయింది. ఈ మొత్తం వ్యవహారాన్ని పట్టణానికే చెందిన మేస్త్రీ పనిచేసే మోకా శ్రీనివాస్ గమనించాడు. వారు ఆస్పత్రికి వెళ్లగానే.. ఎంచక్కా.. డబ్బా కింద పెట్టిన తాళం చెవి తీసుకుని, ఇంట్లోకి దర్జాగా వెళ్లాడు. బీరువా తాళాలు తీసుకుని, దానిని తెరిచి, అందులోని 8 తులాల బంగారు ఆభరణాలను తీసుకుని, తాపీగా వెళ్లిపోయాడు. కాసేపటికి ఇంటికొచ్చిన ఫక్రువలి కుటుంబికులు తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి, చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా మోకా శ్రీనివాస్‌ను బుధవారం అరెస్టు చేశారు. అతడి నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు (నెక్లెస్, లాంగ్ చైన్, జత కమ్మలు, గొలుసు, చిన్నపిల్లలకు చెందిన మూడు ఉంగరాలు) స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు ఛేదింపు వివరాలను వెల్లడించారు. చోరీ అయిన సొత్తు రికవరీ అవడంతో ఫక్రువలి కుటుంబం ఊపిరి పీల్చుకుంది. ఈ చోరీని బట్టి బయటకు వెళ్లేటపుడు ఇంటికి తాళం వేసి, తాళాలు బయట కిటికీలోనో, తలుపు గ్రిల్‌లోనో, డబ్బాల కిందనో పెట్టేసి వెళ్తే దొంగ చేతికి తాళం ఇచ్చినట్లే. బీ కేర్ ఫుల్.

### రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి



జబ్బార్ మృతదేహం

పెద్దవడుగూరు, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి గ్రామసమీపంలో కారులో వివాహానికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడిపత్రికి చెందిన జబ్బార్ (49) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు తాడిపత్రి పట్టణంలోని గాజులపాలెంకు చెందిన పెళ్లిబృందం వజ్రకరూరు మండలంలో జరుగుతున్న వివాహానికి బయల్దేరింది. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని కారు ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనలో పెళ్లికుమారుడు రాజేష్‌తోపాటు శ్రీనివాసులు, సరోజ, ఉమాదేవి, నారాయణమ్మ స్వల్పగాయాలతో బయటపడ్డారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో కలిసి పరిశీలించారు.



## పట్టుదలతోనే లక్ష్యసాధన

- మంత్రి సవిత
- ప్రతిభావంత విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల ఉంటేనే లక్ష్యాన్ని సాధించగలమని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలనీ, అప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం మినీ మహానాడు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ చారిటబుల ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థీ కష్టపడి చదవాలన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకూడదని సూచించారు. అనంతరం పదో తరగతిలో 550 మార్కులు సాధించిన 84 మందికి, ఇంటర్‌లో 900కిపైగా మార్కులు పొందిన 94 మంది విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులకు బ్యాగులు, సర్టిఫికెట్లు భద్రపరచుకునేందుకు ఫైల్, షీల్డ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్, ఎంఈఓ సుధాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, హెచ్ఎం నాగార్జునుడు పాల్గొన్నారు.

### అంధుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తులు

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం కొడిగెనహళ్లిలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల సేవామందిరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకుడు వినోద్ బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఒకటి నుంచి పదో తరగతి వరకు కల్పిస్తున్న ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని అంధులు అర్హులన్నారు. వారి పిల్లలను చేర్పించేందుకు ఆసక్తిగల విద్యార్థుల తల్లిదండ్రులు 40శాతం అంధత్వమున్న సదరం సర్టిఫికెట్, జనన, కుల ధ్రువీకరణ పత్రాలు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతచేయాలని సూచించారు. వివరాలకు 8008889815, 08556-297796 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### విత్తన పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం జేడీఏ కార్యాలయం నుంచి ఉమ్మడి జిల్లాకు చెందిన వ్యవసాయ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఖరీఫ్‌లో విత్తన పంపిణీతో పాటు అవసరమైన అన్నిరకాల ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

### బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 21(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షల ఫలితాలను బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు (ఆర్15) సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూజేఎన్టీయూఏ టీజీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ ప్రొఫెసర్ శివకుమార్, ఏసీఈలు ప్రొఫెసర్ శేఖర్‌రాజు, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

## సిఫార్సుల వేట..!

- వ్యవసాయ శాఖలో అనుకూల స్థానాల కోసం పాట్లు
- ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నం
- జిల్లా కేంద్రంతోపాటు సమీప మండలాలపైనే దృష్టి
- ఉమ్మడి జిల్లాను దాటిన సిఫార్సులు




అనంతపురం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలో బదిలీల పర్వం రసవత్తరంగా సాగుతోంది. కొందరు ఏఓలు, ఏడీఏలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈఓలు నచ్చిన స్థానాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు సమీప మండలాలపైనే కొందరు ఏఓలు దృష్టి సారించినట్లు సమాచారం. ఐదేళ్ల కాల పరిమితి దాటిన అధికారులు, సిబ్బందికి బదిలీని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఇదే క్రమంలో ఐదేళ్ల సర్వీస్ పూర్తికాని అధికారులు, ఉద్యోగులు కూడా ఇతర ప్రాంతాలకు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. పలువురు ఏడీఏలు, ఏఓలు తమకు నచ్చిన స్థానాలకు వెళ్లేందుకు ఎవరిస్థాయిలో వారు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు ఏఓలు ఒకే స్థానాన్ని ఆప్షన్‌గా ఇచ్చి ప్రయత్నాలు చేస్తుండగా.. మరికొందరు రెండు, మూడు స్థానాలు ఆప్షన్‌గా ఇచ్చి ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. ముఖ్యంగా జిల్లా కేంద్రంతోపాటు సమీప మండలాల ఏఓ, ఇతర కేడర్లలోని పోస్టులకు పోటీ ఎక్కువగా ఉన్నట్లు తెలిసింది. కిందిస్థాయి సిబ్బంది తమకు అనుకూలమైన స్థానాల కోసం రాజకీయ నాయకులతోపాటు వ్యవసాయ సంఘాల నాయకులను కలిసి విన్నవించుకుంటున్నారు. ఇదేక్రమంలో ఐదేళ్లు పూర్తికాని అధికారులు తమ స్థానాలను పదిలం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు అధికారులు ఇప్పటికే ఆయా స్థానిక ప్రజాప్రతినిధుల వద్ద తమదైన రీతిలో 'వెరీ గుడ్' మార్కులు కొట్టేసినట్లు చర్చ సాగుతోంది. దీంతో ఆయా స్థానాలకు ఇతర అధికారులు ఆప్షన్ ఇవ్వకుండా మిన్నకుండిపోయినట్లు చర్చ సాగుతోంది.

### రాష్ట్రస్థాయి నుంచే..

బదిలీల సమయంలో ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తప్పనిసరిగా మారింది. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను కొందరు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది నేరుగా సంప్రదిస్తుండగా.. మరికొందరు తమకు అనుకూలమైన ద్వితీయ శ్రేణి నాయకులను వెంటబెట్టుకొని సిఫార్సులు చేయించుకుంటున్నట్లు సమాచారం. తాడిపత్రి నియోజకవర్గ పరిధిలో పనిచేసే ఓ అధికారి జిల్లా కేంద్రంలో పోస్టింగ్ కోసం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులను దాటుకుని... ఏకంగా రాష్ట్రంలో కీలక మంత్రి ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులకు సిఫార్సు చేయించినట్లు సమాచారం. ఆయన చేయించిన సిఫార్సు ప్రస్తుతం వ్యవసాయ శాఖలో చర్చనీయాంశమైంది. జిల్లా పరిధిలోని ప్రజాప్రతినిధులను నేరుగా కలవకుండా అంతస్థాయిలో సిఫార్సు చేయించడం వెనుక ఆంతర్యమేమిటన్న చర్చ జోరుగా సాగుతోంది.

### నేడు పరిశీలన

జేడీఏ ఆధ్వర్యంలో బదిలీలు ఖరారు చేసే పలు కేడర్ల ఉద్యోగులు, సిబ్బంది దరఖాస్తుల పరిశీలన గురువారం చేపట్టనున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు అనంతపురం జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, మినిస్టీరియల్ స్టాఫ్ అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లు తదితర సిబ్బంది బదిలీల దరఖాస్తుల పరిశీలన చేపట్టనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఏఈఓల దరఖాస్తుల పరిశీలన ఉంటుంది.

### 26న సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలకు..

సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏలు ఆన్‌లైన్‌లో ఆప్షన్లు ఇచ్చేందుకు ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలదాకా గడువు విధించారు. ఈనెల 26న జోన్-4 పరిధిలోని అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు సంబంధించి సీనియర్ అసిస్టెంట్లు, ఏఓలు, ఏడీఏల జాబితా పరిశీలన అనంతపురం జేడీఏ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఆయాజిల్లాల జేడీఏలు, అధికారులు హాజరుకానున్నారు. పరిశీలన తర్వాత ఆ జాబితాను వ్యవసాయ శాఖ కమిషనరేట్‌కు పంపనున్నారు.

## కేసులకు భయపడేది లేదు

- వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి



సమన్వయకర్తలతో మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

అనంతపురం క్రైం, మే21(ఆంధ్రజ్యోతి): ఎవరిపై కేసులు పెట్టినా భయపడేది లేదనీ, ధైర్యంగా ఎదుర్కొంటామని రాజంపేట ఎంపీ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి అన్నారు. నగరంలోని సప్తగిరి సర్కిల్‌లోని ఓ హోటల్‌లో బుధవారం ఎన్నికల పరిశీలకులు రమేష్‌రెడ్డి, నరేష్ కుమార్‌రెడ్డి, జిల్లాల అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి, ఉషశ్రీచరణ్‌తో కలిసి ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలతో అంతర్గత సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందన్నారు. కేసులతో అందరినీ భయపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నాయకుల నుంచి కార్యకర్తల వరకు ఎవరిపై కేసు పెట్టినా భయపడాల్సిన పనిలేదన్నారు. ధైర్యంగా పోరాటం చేద్దామన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేద్దామన్నారు. సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. సర్పంచ్, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గాల సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, వై.వెంకట్రామిరెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, పెద్దారెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, రంగయ్య, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దీపిక, మక్బుల్, ఈరలక్కప్ప పాల్గొన్నారు.

## కేఎస్ ఆర్టీసీలోనూ రాయితీ ఇవ్వండి

- కర్ణాటక రవాణాశాఖ మంత్రికి ఆర్టీసీ జోనల్ చైర్మన్ వినతి



కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

అనంతపురం కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు బుధవారం కర్ణాటక రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, కేఎస్ ఆర్టీసీ ఎండీ నందినిదేవిలను వారి కార్యాలయాల్లో కలిశారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు టికెట్ ధరల్లో 25శాతం రాయితీ కల్పించినట్లుగా ఏపీలో తిరిగే కేఎస్ఆర్టీసీ బస్సుల్లోనూ 25శాతం రాయితీ కల్పించాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ ఏపీలో తిరిగే కేఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీనియర్ సిటిజన్లకు రాయితీ కల్పించకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా వినతులు వస్తున్నాయని, వారి కోరిక మేరకు ఏసీ సర్వీసులు సహా అన్నిరకాల సర్వీసుల్లోనూ రాయితీ కల్పించాలని కోరారు.

## న్యూస్ బాక్స్



స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

### మినీమహానాడు స్థల పరిశీలన

పుట్టపర్తిరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో శనివారం తెలుగుదేశం పార్టీ మినీమహానాడు కార్యక్రమాన్ని నిర్వహించేందుకు స్థలాలను టీడీపీ ప్రముఖులు బుధవారం పరిశీలించారు. ఇందులో బీసీ సంక్షేమ శాఖా మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఉన్నారు. వీరు మామిళ్ళకుంట కూడలిలో ఉన్న ఏపీఐఐసీలోని స్థలాన్ని , ప్రశాంతిగ్రామ్ పోలీసుపెరేడ్ గ్రౌండును పరిశీలించారు. వారి వెంట జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కన్వీనర్లు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ ఉన్నారు.

### ఉచిత కంప్యూటర్ శిక్షణ

ధర్మవరం, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేశామని, ఇందులో జూన్ 1వ తేదీ నుంచి మిస్ డేటా అనాలిస్ట్ ఫైనాన్సియల్ సర్వీస్ కోర్సును ప్రారంభిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌బాబు బుధవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన యువతీ యువకులు అర్హులని, వివరాలకు 91822 88465 నెంబర్లకు లేదా ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో సంప్రదించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిక్షణ అనంతరం వీరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు.

### పెద్దకోట్ల గ్రామంలో సోదాలు

తాడిమర్రి, మే21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో ఎస్ఐ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం సోదాలు నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఓటరు జాబితాపై సమావేశం

ధర్మవరం, మే 21(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలోని మార్పులు, చేర్పులపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీఓ మహేశ్ బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయంలో ఆయన రాజకీయపార్టీల నాయకులతో చర్చించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎన్నికల సీనియర్ సహాయకులు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

### రేపు ఎరికలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నంబులపూలకుంట, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లవారిపల్లిలో కొత్తగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఎరికలమ్మ (ఆవుదేవత) విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహిస్తామని, గురువారం గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తామని, శుక్రవారం గర్త పూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, జ్వాలాదర్శనం, బింబ, కుంభ దర్శనం, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

అమడగూరు (కదిరి), మే 21(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని గాజులవారిపల్లిలోని శ్రీమాతృశ్రీ వృద్ధాశ్రమంలో ఉన్న 24 మందికి దుప్పట్లను మారుతీపురానికి చెందిన సుధాకర్ బుధవారం అందజేశారు. 150 కేజీల బియ్యాన్ని, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో ఆ ఆశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి, సుధాకర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ సీజ్

అమడగూరు (కదిరి), మే 21(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ సమీపంలోని మద్దెమ్మ చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ రామనాథ్‌రెడ్డి చెప్పారు. ఎలాంటి అనుమతులూ లేకుండా మట్టిని తరలిస్తున్నట్లు గుర్తించామని, సీజ్ చేసి రూ.రెండు వేలు జరిమానా విధించామని అన్నారు.

### టీచర్లకు అదనపు పాయింట్లు ఇవ్వాలి

తనకల్లు, మే 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బదిలీల్లో స్టేషన్ పాయింట్లతో పాటు అదనపు పాయింట్లు ఇవ్వాలని పీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రతినిధి శివశంకర్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో 2023లో జీవో నెంబర్ 117 అమలు వల్ల ఒకేసారి రేషనలైజేషన్‌కు గురయ్యారని, ఇప్పుడు రీస్ట్రక్చర్ వల్ల 2025లో మరోసారి రేషనలైజేషన్‌కు గురవుతున్నారని తెలిపారు. ఇలా రెండుమార్లు గురైన ఉపాధ్యాయులకు స్టేషన్ సీనియార్టీ పాయింట్లు, రెండు సంవత్సరాల పాయింట్లు మాత్రమే వస్తున్నాయన్నారు. ఈ కారణంగా ఆ ఉపాధ్యాయులు దూర ప్రాంతాలకు బదిలీ అవుతారన్నారు. రెండుసార్లు రేషనలైజేషన్‌కు గురైన ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందోందని, అలాంటి ఉపాధ్యాయులకు ఎనిమిది పాయింట్లు ఇవ్వాలని కోరారు.

### ఎన్ఎంయూఏ జోనల్ కార్యదర్శిగా సురేంద్ర



కదిరిఅర్బన్, మే21(ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ (ఎన్ఎంయూఏ) కడప జోన్ జాయింట్ సెక్రటరీగా తనను నియమించినట్లు కదిరి డిపోలో పనిచేస్తున్న సురేంద్ర తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు నుంచి తాను బుధవారం నియామక పత్రం అందుకున్నట్లు చెప్పారు.

### బీసీలకు కన్వీనర్ పదవి ఇవ్వాలి

నల్లమాడ, మే 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పదవిని ఈ సారి తమ కులస్థులకే కేటాయించాలని మండలంలోని బీసీలు కోరుతున్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి మండలంలోని బీసీలకు కన్వీనర్ పదవి దక్కలేదని, రెడ్డికులస్థులు, రెండుమార్లు బలిజలకు కన్వీనర్ పదవి దక్కిందన్నారు. ఇప్పటికైనా అధిష్టానం కన్వీనర్ పదవిని బీసీలకు కేటాయించాలని కోరుతున్నారు.

### గడువులోగా రీసర్వే పూర్తిచేయాలి

ధర్మవరంరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న రీసర్వేను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులకు ఆర్డీఓ మహేష్ సూచించారు. మండలంలోని పోతులనాగేపల్లిలో నిర్వహిస్తున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఇప్పటివరకు ఎంతవరకు రీసర్వే చేశారు.. ఎంత విస్తీర్ణం రీసర్వే చేశారని సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. రీసర్వేలో ఎ టువంటి తప్పుల్లేకుండా రికార్డుల ప్రకారం పూర్తి చేయాలన్నారు. హద్దులను రైతులకు చూపించి వారి సమక్షంలోనే హద్దురాళ్లను ఏర్పాటుచేయాలన్నారు. రైతులు కూడా రీసర్వేకు సహకరించాలన్నారు.

### నేడు హనుమజ్జయంతి

పెనుకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాలు, సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. స్థానిక ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం 7 గంటల నుంచి అభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ, 9గంటల నుంచి వాల్మీకి రామాయణం, అంతర్గత సుందరాకాండ యజ్ఞం, మహామంగళహారతి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పవన్‌కుమార్ తెలిపారు. దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మినీమహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

# పుట్టపర్తి సమగ్రాభివృద్ధే లక్ష్యం

- హంద్రీనీవా నీటితో సస్యశ్యామలం చేస్తా
- మినీ మహానాడులో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా.. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా.. నిరంతరం కృషిచేస్తున్నా. వీటి సాధనకు మీ అందరి ఆశీస్సులు కావాలి.' అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం నాటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నుంచి సామాన్య కార్యకర్త వరకూ వేధించడమే లక్ష్యంగా పాలన సాగించిందన్నారు. అభివృద్ధిని.. ప్రజా సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. దీంతో ప్రజలు అఖండ విజయంతో కూటమి అభ్యర్థులను గెలిపించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైసీపీ నాయకులపై ప్రతీకార చర్యలు, వేధింపులకు పాల్పకుండా.. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. నియోజకవర్గంలోనూ అదే రీతిలో పాలన సాగిస్తున్నామన్నారు. రాబోయే మూడేళ్లలో నియోజకవర్గంలోని 193 చెరువులను హంద్రీనీవా నీటితో నింపి నియోజకవర్గాన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చుతానన్నారు. మాజీ మంత్రి మాట్లాడుతూ.. హామీలను నెరవేర్చి.. ప్రజలు తమ కుటుంబంపై ఉంచుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల కన్వీనర్లు రామాంజినేయులు, జయచంద్ర, గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఓలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, నాయకులు పీసీ గంగన్న, ఓబుళరెడ్డి, సాలక్కగారి శ్రీనివాసులు, శ్రీరామిరెడ్డి, ఎల్ఐసీ నరసింహులు, బెస్తచలపతి, రామ్‌లక్ష్మణులు, రత్నప్పచౌదరి, ఐటీడీపీ, టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత నాయకులు, తెలుగు మహిళా నేతలు యశోద రాయుడు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### నిందలు వేస్తే ఊరుకోం

'నాపై లేనిపోని ఆరోపణలు చేసి .. నిందలు వేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. నాపై అసత్య ప్రచారం చేస్తున్నా.. వార్తలు రాస్తున్నవారిపై న్యాయపోరాటం చేస్తా. నా ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తే సహించేది లేదు... జాగ్రత్త..' అని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హెచ్చరించారు. బుధవారం సాయంత్రం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో బీజేపీ, జనసేన పార్టీల నాయకుల కృషి వల్లే కూటమి అఖండ విజయం సాధించిందన్నారు. ఆ పార్టీ నాయకుల పట్ల తనకు చాలా గౌరవం ఉందని, వారికి మేలు చేయడమే తప్ప.. కీడు చేసే ప్రశక్తే లేదని స్పష్టం చేశారు. అలాంటి నాయకులకు తాను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, వాటిలో ఎలాంటి నిజమూ లేదని స్పష్టం చేశారు. ముదిగుబ్బ ఎంపీపీ తన భూములను అక్రమించుకున్నారని, వాటిని ఎలా కాపాడుకోవాలో తనకు తెలుసునని అన్నారు. తన జీవితంలో అక్రమంగా ఒక సెంటు భూమి కూడా ఆక్రమించలేదన్నారు. జనసేన పార్టీ పేరు చెప్పుకుని ఓ నయవంచకుడు ఆంధ్రా, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో చాలా మందిని మోసం చేశాడని, అతన్ని ఈ మధ్య కాలంలో పోలీసులు అరెస్టు చేస్తే తానే అరెస్టు చేయించినట్లు ప్రచారం చేస్తున్నాడని, అందులో నిజంలేదని అన్నారు.

## ఘనంగా మారెమ్మ జాతర

ముదిగుబ్బ, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్డంపల్లి తండాలో గ్రామదేవత మారెమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులూ అధిక సంఖ్యలో పాల్గొని.. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ధర్మవరం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకొని.. పూజాలు చేయించారు. అనంతరం ఆయన ఆ తండాలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, సీసీరోడ్లు, డ్రైనేజీ.. తదితర సమస్యలు ఉన్నాయని ఆ తండా వాసులు శ్రీరామ్ దృష్టికి తీసుకువచ్చారు. వీటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని శ్రీరామ్ వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



అలంకరణలో అమ్మవారు



తండాలో సమస్యలపై ఆరా తీస్తున్న పరిటాల శ్రీరామ్

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: కలెక్టర్

పుట్టపర్తిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం పుట్టపర్తిలోని సాయిఆరామం ఫంక్షన్‌హాల్‌లో యోగా అభ్యాస కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభిచారు. కలెక్టర్ మాట్లాడుతూ వయో, లింగ భేదం లేకుండా అందరూ యోగాను సాధన చేయాలన్నారు. మే 21 నుంచి జూన్ 21 వరకు నెలరోజుల పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. యోగా గురువు చంద్రశేఖరరెడ్డి, అధికారులతో ఆసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖాధికారి ఉదయ్‌భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ ఫిరోజ్‌బేగం, పర్యాటక శాఖాధికారి ప్రతాప్‌రెడ్డి, డీపీఆర్వో వేలాయుధం పాల్గొన్నారు.

● బత్తలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, పరిపాలన అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో యోగా చేస్తున్న కలెక్టర్, అధికారులు



బత్తలపల్లిలో యోగా చేస్తున్న సిబ్బంది

## సచివాలయంలో జగన్ ఫ్లెక్సీలు

బత్తలపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయం-2లో నేటికీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫ్లెక్సీలే దర్శనమిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలకు సంబంధించిన నిలువెత్తు భారీ ఫ్లెక్సీలను ప్రదర్శనకు ఉంచారు. బుధవారం ఆ సచివాలయానికి వెళ్లిన టీడీపీ నాయకులు దీన్ని గమనించి.. ఆ సిబ్బందిని నిలదీశారు. కనీసం ఫ్లెక్సీలను తిప్పిపెట్టకుండా.. ఇలా ప్రదర్శనకు ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. దీనికి ఆ ఉద్యోగులు సమాధానం చెప్పకుండా.. అక్కడి నుంచి జారుకున్నారు. ప్రభుత్వం మారినా ఇంకా కొందరి సచివాలయ ఉద్యోగుల తీరు మారడం లేదని, ఉద్యోగుల్లా కాకుండా వైసీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆ నాయకులు ధ్వజమెత్తారు. ఈ కార్యాయంలోని పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ ఉద్యోగి అనే విషయాన్ని మరచి.. కార్యాలయానికి వచ్చే వారివద్ద నిత్యం కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తూ.. వైసీపీని, జగన్‌ను పొడుగుతున్నాడని ఆరోపించారు. ఆయన సచివాలయంలో అందుబాటులో ఉండటం లేదని, కనీసం ఫోన్ చేస్తే లిఫ్ట్ కూడా చేయడం లేదని అన్నారు. ఇలాంటి వారి వల్ల మిగిలిన సచివాలయాల ఉద్యోగులకు చెడ్డ పేరు వస్తోందన్నారు. కార్యక్రమంలో నెట్టెం రమణ, సదాశివ, శ్రీరాములు, హరి, నాగార్జున పాల్గొన్నారు.





సచివాలయంలో ఉన్న జగన్ ఫ్లెక్సీలు

# గ్రామాల్లో నీటి కష్టాలు

- నీరుగారిన 'సత్యసాయి' పథకం
- వృథాగా ట్యాంకులు, పైప్‌లైన్లు

నల్లమాడ, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలు తాగునీటి ఎద్దడితో విలవిల్లాడుతున్నాయి. ఈ గ్రామస్థులు ఫ్లోరైడ్ బారిన పడకుండా మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో సత్యసాయి పథకం కింద రూ.కోట్లు ఖర్చు పెట్టి 2002లో పైప్‌లైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే రెండేళ్ల నుంచి నీరు సరఫరా చేయకపోవడంతో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. కదిరి రూరల్ మండలంలోని కె. బత్తలపల్లి నుంచి నల్లమాడలోని సంప్‌హౌస్ వరకు తాగునీరు సరఫరా అవుతోంది. అయితే ఇక్కడి నుంచి ఓడీసీ, అమడగూరు, రాగానిపల్లి, గోపేపల్లి, బొగ్గలపల్లి, రామాపురం తదితర ప్రాంతాలకు నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆ పథకం నీరుగారింది. ప్రస్తుతం గ్రామాల్లో నీటి ట్యాంక్‌లు దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ నీటిసరఫరా విభాగం ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలో నీటి సరఫరా బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించారు. రెండేళ్ల నుంచి నీటిసరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గ్రామాల్లోని నీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో ఈ నీటిని తాగలేక.. సత్యసాయి పథకం నీరు రాక.. ప్రైవేట్ వ్యక్తుల వద్ద క్యాన్ నీటికి రూ. 10 వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సత్యసాయి తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గోపేపల్లి వద్ద నిరుపయోగంగా ఉన్న ట్యాంక్

### నీరు రాక రెండేళ్లయ్యింది



గతంలో సత్యసాయి పథకం ద్వారా తాగు నీరు బాగా సరఫరా అయ్యేది. రెండు సంవత్సరాలుగా మా గ్రామానికి ఆ పథకం నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అరకొరగా పంచాయతీ నీరు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్యసాయి పథకం నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

-దస్తగిరివలీ, చౌటకుంటపల్లి

### ఇబ్బందులు పడుతున్నాం



గతంలో సత్యసాయి పథకం కింద నీరు సక్రమంగా వచ్చేవి. మాకు ఏ సమస్యా ఉండేది కాదు. ఏడాదిన్నర నుంచి మా గ్రామానికి ఆ నీరు రావడం లేదు. దీంతో ఫ్లోరైడ్ ఉన్నా.. పంచాయతీ బోరు నీటినే తాగుతున్నాం. పంచాయతీ బోరు మోటర్‌కు కూడా కాలిపోతోంది. దీంతో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామానికి సత్యసాయి పథకం కింద నీటి సరఫరాను పునరుద్ధరించేలా అధికా రులు, పాలకులు చర్యలు తీసుకోవాలి.

-వెంకట్రామిరెడ్డి, గోపేపల్లి

### పైప్‌లైన్ లీకేజీ వల్లే..

బత్తలపల్లి సమీపంలోని చిన్నకోట్ల నుంచి నల్లమాడకు పైప్‌లైన్ ద్వారా నీరు సరఫరా కావాల్సి ఉంది. ఈ పైప్‌లైన్ లీకేజీ వల్ల చాలా నీరు వృథా అవుతోంది. కనీసం నల్లమాడలోని సంప్‌హౌస్ కూడా నిండటం లేదు. దీంతో ఇక్కడి నుంచి గ్రామాలకు నీటిని సరఫరా చేయలేకపోతున్నాం. పలుమార్లు మరమ్మతులు చేయించినా.. ఆశించిన ఫలితాలు లేవు. అయినా మరమ్మతు పనులు చేస్తూనే ఉన్నాం.

-శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, నల్లమాడ

## క్రైం న్యూస్..

### ఆటో ఢీకొని బేల్దారి మృతి

ధర్మవరం, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో బుధవారం రోడ్డు దాటుతున్న బైకును ఆటో ఢీకొనడంతో బేల్దారి మహేంద్ర (25) మరణించాడు. చిత్తూరుకు చెందిన మహేంద్ర ఏడేళ్ల క్రితం ధర్మవరం వలస వచ్చాడు. ఆయనకు భార్య శశికళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేంద్ర ఇక్కడే బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. బుధవారం మహేంద్ర ద్విచక్రవాహనంలో లక్ష్మీచెన్నకేశవ పురంలో విద్యుత్‌సబ్‌స్టేషన్ ఎదురుగా రోడ్డు క్రాస్ చేస్తుండగా మోటుమర్ల వైపు నుంచి ఆటో వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో మహేంద్ర కింద పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని టూటౌన్ పోలీసులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

### ముగ్గురిపై కేసు నమోదు

కదిరి, మే 21(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ స్థలంలో అక్రమంగా నిర్మాణాలకు పాల్పడిన ముగ్గురిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల గ్రామం సర్వేనెంబర్ 408, 400-ఎలో ఉన్న స్థలం వక్ఫ్‌కు చెందినది. క్రిషి సంస్థ కుటాగుళ్ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తోంది. ఈనెల 20న క్రిషి సంస్థకు చెందిన అబ్దుల్ అనే ఇంజనీర్, మాజీ కౌన్సిలర్ భర్త నబీరసూల్, రెండో వార్డు కౌన్సిలర్ మహమ్మద్ హుస్సేన్ వక్ఫ్‌కు చెందిన స్థలంలోకి ప్రవేశించారు. స్తంభాలు నాటేందుకు పూనుకున్నారు. దర్గా ముతవలీ ఉబేదుల్లా హుస్సేని వారిని అడ్డుకోవడానికి యత్నించగా.. వారు అతడిని బెదిరించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

### ఆలయ భూములను స్వాధీనం చేసుకోవాలి: సీపీఐ



భూమిని పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

ధర్మవరం, మే 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని చిన్నూరు గ్రామంలో జ్వాలా లక్ష్మీనరసింహస్వామి మఠానికి చెందిన రూ. కోట్లు విలువ చేసే భూములను దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు డిమాండ్ చేశారు. లేకుంటే ఆ ఆలయాలు, రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ మఠానికి చెందిన భూములను వైసీపీ నాయకులు అప్పనంగా కొట్టేశారు. దీనిపై ఆంధ్రజ్యోతి దేవుడికే శఠగోపంపై పేరుతో ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన మునుగు మధు ఆ స్థలాలను పరిశీలించారు. ఈ అవినీతిపరులతో ఎండోమెంట్ అధికారులు కుమ్మకయ్యారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడెక్కడ ప్రభుత్వ, మఠం, దేవాదాయ భూములు కబ్జాకుగురయ్యాయే విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట సీపీఐ నేత నాగేంద్ర ఉన్నారు.

### పాస్టర్లకు అండగా టీడీపీ



సమవేశంలో మాట్లాడుతున్న స్వామిదాస్

పుట్టపర్తిటౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాస్టర్లు అందరికి టీడీపీ అండగా ఉంటుందని రాష్ట్ర టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాస్ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలోని గ్రేస్‌బాబిస్ చర్చిలో పలువురు పాస్టర్లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్నపాస్టర్ల వేతనాలను ప్రభుత్వం విడుదల చేయడం హర్షనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8,427 మంది పాస్టర్లకు ఏడునెలల గౌరవ వేతనం ఒకేసారి వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. టీడీపీ అధికారంలో ఉంటేనే క్రైస్తవుల అభివృద్ధి సాధ్యమన్నారు. క్రైస్తవుల సంక్షేమకోసం కూటమి ప్రభుత్వ పలురకాల పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. పాస్టర్లకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో క్రిస్టియన్ సెల్ నాయకులు శ్యాముల్, పుట్టపర్తి పాస్టర్ అసోషియేషన్ అధ్యక్షుడు జోసఫ్, పాస్టర్లు డేనియల్, డేవిండ్, జాన్‌మార్కు తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగిన రిలేదీక్ష




రిలేదీక్షలో పాల్గొన్న నాయకులు

ధర్మవరం, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలోని సర్వే నెంబరు 650-2 అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లంబర్స్, కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు చేపట్టిన రిలేదీక్ష రెండో రోజైన బుధవారమూ కొనసాగింది. దీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తి పరమేశ్ మద్దతు ప్రకటించారు.

### 'కిశోరి వికాసం'పై అవగాహన

నల్లచెరువు (కదిరి), మే 21(ఆంధ్రజ్యోతి): నల్లచెరువు మండలంలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ రమణప్పగారిపల్లిలో సీడీపీఓ జయంతి కిశోరి వికాసం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, లైంగికదాడులు, వేధిపులు, పోక్సో చట్టం.. తదితర వాటిపై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌష్టికాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, బుతుస్రావంపై వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రఫీమున్నీషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

### రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ధర్మవరం, మే 21(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కలీమ్, మునాఫ్, టిప్పుసుల్తాన్, మురళీ, తహీర్, రాజు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

## వైభవంగా శ్రీవారి వసంతోత్సవం


స్వామివారికి శయనోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పెనుకొండ, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు రాజీవ్ చార్యులు, మధుసూదనాచార్యులు, రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో విద్యారాధన, నిత్యహోమబలి, వసంతోత్సవం, మహామంగళహారతి తీర్థప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం ద్వజారోహణ, ద్వాదశారాధన, శయనోత్సవం, ఏకాంతసేవ, మధ్యవలపూజ, మహామంగళహారతి ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేడు హనుమజ్జయంతి


అలంకరణలో స్వామివారు

పెనుకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాలు, సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. స్థానిక ఊరువాకిలి ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం 7 గంటల నుంచి అభిషేకాలు, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ , 9గంటల నుంచి వాల్మీకి రామాయణం, అంతర్గత సుందరాకాండ యజ్ఞం, మహామంగళహారతి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పవన్‌కుమార్ తెలిపారు. దక్షిణముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## షైనింగ్‌స్టార్ అవార్డు అందుకున్న అక్షిత


మంత్రి లోకేశ్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న అక్షిత

అమరాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో జి. అక్షిత పది ఫలితాల్లో 586మార్కులు సాధించింది. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ చేతులమీదుగా షైనింగ్ స్టార్ అవార్డును బుధవారం అందుకుంది. నిరుపేద కుటుంబంలో పుట్టిన అక్షిత తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా అక్షిత కష్టపడి చదివి అవార్డు అందుకోవడంతో వారి తల్లిదండ్రులు చిత్తయ్య, ఈరక్క ఆనందం వ్యక్తం చేశారు. మండల విద్యాధికారులు రాఘవయ్య, వెంకటరమణ నాయక్, కేజీబీవీ ప్రిన్సిపాల్ శోభారాణి పాఠశాల సిబ్బంది అభినందించారు. అక్షిత మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి ఉపాధ్యాయులే కారణమన్నారు.

## ఎండీయూ వాహనాల రద్దుపై డీలర్ల హర్షం


సీఎం, డీసీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హిందూపురం, మే21(ఆంధ్రజ్యోతి): ఎండీయూ వాహనాలు రద్దుచేయడంపై చౌకధాన్యపు డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నాదెండ్లమనోహర్, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రపటాలకు డీలర్లు క్షీరాభిషేకం చేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ఎండీయూ వాహనాలు రద్దుచేయడం హర్షణీయమన్నారు. పట్టణ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు బాబురెడ్డి, గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఖాన్, కార్యదర్శి ఫకృద్దీన్, బాషా, గంగరత్నమ్మ, ఆనంద్, భార్గవ్, నరసింహులు, ఎస్సీసెల్ వెంకటరమణ పాల్గొన్నారు.

## బ్రోచర్ల విడుదల

హిందూపురం, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సప్తగిరి కళాశాలలో 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే ట్యాలీ వర్క్‌షాపునకు సంబంధించి బ్రోచర్లు బుధవారం విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు సాగే ట్యాలీపై వర్క్‌షాపులో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు పాల్గొనాలన్నారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఏఓ గంగిరెడ్డి, రీసోర్స్‌పర్సన్ వేణుగోపాల్, విజయకుమార్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో మహిళ మృతి


పుష్పలత(ఫైల్)

మడకశిర రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువ అచ్చంపల్లి గ్రామానికి చెందిన పుష్పాలత(36) అనే మహిళ బుధువారం విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మధ్యాహ్నం తాగునీటి కోసం ఇంట్లో ఉన్న సంపువద్ద మోటర్‌కు ఉన్న స్విచ్‌ఆన్ చేస్తుండగా గురైందన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మెరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## బొలెరో వాహనం బోల్తా.. ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం పెద్దమంతూరువద్ద కల్వర్టును బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ఆనంద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు పావగడకు చెందిన ఆనంద్ బొలేరో వాహనంలో బుధవారం బెంగళూరుకు వెళ్తున్నాడు. పెద్దమంతూరు వద్దకు రాగానే ప్రమాదవశాత్తు బొలేరో కల్వర్టును ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నిర్మాణంలో ఉన్న కల్వర్టులో బోల్తాపడిన బొలెరో

# లీక్ అవుతున్న తాగునీటి పైపులు..!

● రోగాలబారిన సి.కొడిగేపల్లి ప్రజలు
● పట్టించుకోని పంచాయతీ అధికారులు

మడకశిర రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీ కొడిగేపల్లి గ్రామంలో పైపులైన్ పగిలి నీరు లీక్ అవుతున్నాయి. ఆ నీటినే తాగడంతో ప్రజలు రోగాలుబారిన పడుతున్నారు. గ్రామం చివరిలో అమ్మవారి ఆలయం వద్ద ఉన్న బోరు నుంచి గ్రామానికి పైపులైన్ ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. ఎస్సీ కాలనీ సమీపంలో ప్రధాన రహదారి వద్ద పైపు పగిలి తాగునీరు వృధాగా పోతున్నాయి. వృథానీరు రోడ్డుపై నిలిచి తిరిగి ఆ నీరే పైపులలోకి చేరుతున్నాయి. ఆ నీటిని తాగడం వద్ద గ్రామంలో చాలా మంది రోగాలబారిన పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు బోరు వద్ద కూడా పైపు పగిలిపోయి నీరు బయటకు వచ్చి తాగునీరు కలుషితమవుతున్నాయి. ఈ విషయానిన మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదుల సంఖ్యలో జ్వరాలతో బాధపడుతున్నారు. పక్కనే ఉన్న కల్లుమర్రి ప్రాథమిక ఆస్పత్రిలో చేరుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



బోరు వద్ద లీక్ అవుతున్న తాగునీరు, ఎస్సీ కాలనీ వద్ద వృథాగా పారుతున్న నీరు



రోగులతో కిటకిటలాడుతున్న కల్లుమర్రి పీహెచ్‌సీ

### అధికారులు పట్టించుకోవడంలేదు: రంగారెడ్డి, సీ కొడిగేపల్లి



తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీరు కలుషితమవుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదు. కలుషిత నీరు తాగడంతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలి.

### సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి - డాక్టర్ వినోద్‌కుమార్, కల్లుమర్రి

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలం ప్రారంభమవుతోందని, ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలి.

## శోభాయాత్రను శాంతియుతంగా జరుపుకోండి

సోమందేపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం జరిగే హనుమాన్ శోభాయాత్రను శాంతీయుతంగా జరుపుకోవాలని డీఎస్పీ నరసింగప్ప సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో హిందూ ముస్లిం పెద్దలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మార్కెట్ రోడ్డులో వెలసిన భైలాంజనేయస్వామి ఆలయంలో విశేష పూజల అనంతరం శోభయాత్ర ఉంటుందన్నారు. హిందూ, ముస్లింలు సోదరభావంతో కార్యక్రమానికి సహకరించుకోవాలన్నారు. పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యను దూరం చేయకండి

హిందూపురం, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా ప్రణాళిక అమలైతే పేద విద్యార్థులకు విద్య దూరం అవుతుందని ఏఐడీఎస్ఓ నాయకులు అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను పరిరక్షించడం కోసం బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం చెప్పిందని, కానీ అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేయలేదన్నారు. దీనిని ప్రభుత్వం విరమించుకోవాలంటూ ఆ సంఘం నాయకుడు ముబీన్ ఫిర్దోస్ డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనుల పరిశీలన


ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటలక్ష్మి

సోమందేపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను బుధవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మి పరిశీలించారు. బ్రాహ్మణపల్లిలో ఉపాధి పనులు పరిశీలించి మస్టర్‌రోల్‌లో నమోదు చేస్తున్నారా లేదాని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.వేతనాలు సరిగా అందుతున్నాయా అని కూలీలతో అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను ఉపాధి కూలీలు ఆమె దృష్టికి తెచ్చారు. ఈదులబళాపురంలో చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని వందశాతం పాటించాలని సూచించారు. అనంతరం జూలకుంట గ్రామానికి చేరుకుని సచివాలయాన్ని సందర్శించారు. ఆమె సిబ్బంది హాజరు, బయోమెట్రిక్, విధులకు హాజరవుతున్న సమయం, రికార్డులను తనిఖీ చేశారు. ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మడకశిరలో మోస్తరు వర్షం

మడకశిర టౌన్, మే21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గవ్యాప్తంగా నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రహదారులపై వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రైతులు భూమిని దుక్కిదున్నే పనులకు సిద్ధమవుతున్నారు. గత ఏడాది వర్షాలు లేక పంటలు సరిగా పండక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయరు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆపద్ధర్మ ఛైర్‌పర్సన్‌గా వెంకటలక్ష్మమ్మ


వెంకటలక్ష్మమ్మను సన్మానిస్తున్న కౌన్సిలర్లు

మడకశిర టౌన్, మే 21(ఆంధ్రజ్యోతి): మడకశిర నగర పంచాయతీలో ఇటీవల ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో వైసీపీకి చెందిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు తమ పదవులు కోల్పోయారు. దీంతో బుధవారం ఆపద్ధర్మ ఛైర్‌పర్సన్‌గా 14వ వార్డు కౌన్సిలర్ వెంకటలక్ష్మమ్మను కౌన్సిలర్లు ఎంపిక చేశారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఛైర్మన్ ఎన్నుకునే వారకు ఆమె ఛైర్‌పర్సన్‌గా కొనసాగుతారు. టీడీపీకి చెందిన కౌన్సిలర్లు వెంకటలక్ష్మమ్మను అభినందించారు, త్వరలో సమావేశం నిర్వహించి నగర పంచాయతీ అభివృద్ధికి అందరి సలహాలు తీసుకోనున్నట్లు ఆమె తెలిపారు.

## వ్యవసాయ పరికరాలను వినియోగించుకోండి


రైతులకు వ్యవసాయ పరికరాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

గుడిబండ, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీతో అందించే పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, ఏఓ వీరనరేష్, ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్ కోరారు. బుధవారం మండలంలోని సీసీగిరి రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీతో అందించే పరికరాలను తీసుకుని వ్యవసాయ సాగుచేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. క్లస్టర్ ఇన్‌చార్జి లక్ష్మీనరసప్ప, రైతుసేవా కేంద్రం అధికారి మహేష్, రైతులు పాల్గొన్నారు.

## న్యాయాధికారిని కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు


జిల్లా న్యాయాధికారిని సత్కరిస్తున్న న్యాయవాదులు

హిందూపురం, మే 21(ఆంధ్ర జ్యోతి): అనంతపురం జిల్లా న్యాయాధికారి భీమారావును హిందూపురం అసోసియేషన్ నాయకులు బుధవారం కలిశారు. అసోసియేషన్ అధ్యక్షులు వన్నేరప్ప, న్యాయవాది శివశంకరప్ప, సభ్యులు రామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. హిందూపురం కోర్టులోని వలిక సదుపాయాలు, ఇతర సమస్యలను న్యాయాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

# భూసేకరణ ఆపండి

● తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

హిందూపురం, మే 21(ఆంధ్రజ్యోతి):రైతులకు కనీస సమాచారం ఇవ్వకుండా భూసేకరణ చేస్తున్నారని, వెంటనే ఆపాలని రైతులు, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హిందూపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద చలివెందుల, రాచపల్లికి చెందిన రైతులతో కలిసి రైతు సంఘం, ప్రజాసంఘం నాయకులు ధర్నా చేపట్టారు. నాయకులు వెంకట్రామిరెడ్డి, సిద్దారెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు రైతులకు సమాచారం ఇవ్వకుండా గ్రామాల్లో భూములకు సంబంధించిన పట్టాదార్ పాసుపుస్తకాలు, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకాలను తీసుకురావాలని దండోరా వేయించారన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నామన్నారు. చాలా మంది రైతులకు ఎకరం, రెండెకరాల లోపు ఉందన్నారు. ప్రభుత్వం పరిశ్రమల కోసం భూములు లాక్కొంటే రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. సమస్యను ఎమ్మెల్యే బాలకృష్ణ వద్దకు తీసుకెళ్లి రైతులకు న్యాయం చేసే విధంగా ప్రయత్నిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.


లేపాక్షి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కొండూరు రైతులు


ధర్నా చేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు

### ఐటీపార్కుకు భూములు ఇవ్వం

లేపాక్షి: ఐటీ పార్కు నిర్మాణం కోసం దాదాపు 600ఎకరాల భూములను సర్వేచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇందులో భాగంగా కొండూరు, చలివెందుల రహదారిలో స్థలాన్ని సర్వేచేసేందుకు బుధవారం రెవెన్యూ అధికారులు వెళ్లారు. కొండూరు గ్రామస్థులు అధికారులను అడ్డుకుని తమ భూములు ఐటీ రంగానికి ఇవ్వబోమని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మూకుమ్మడిగా రైతులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతిపత్రం అందించారు. తరతరాలుగా తమ కుటుంబ సభ్యులు భూములను నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, ఐటీరంగం పేరుతో తమ భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే తమ బతుకులు వీధినపడతాయన్నారు. ఎన్నిలక్షలు చెల్లించినా తమ భూములు వదులకునే ప్రసక్తేలేదన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఐటీ రంగానికి భూములు మరోచోట పరిశీలించాలని కోరారు.

# హైవేపై పశువుల సంచారం

● ఆందోళన చెందుతున్న వాహనదారులు
● మృత్యువాత పడుతున్న మూగజీవాలు

సోమందేపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): అసలే వర్షాలు కురుస్తున్న సమయం. ఆ పై హైవేలో ప్రతి వాహనం 100కి.మి. స్పీడ్‌తో వెళ్తుంటాయి. తరచూ రోడ్డు మధ్యలో పశువులు సంచరిస్తుండటంతో కంట్రోల్ చేయలేక వాటిని ఢీకొట్టడమో లేదా అదుపుతప్పి బోల్తాకొట్టడమో జరుగుతున్నాయి. గతంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయినా హైవేపై పశువులను సంబంధిత శాఖాధికారులు నియంత్రించడంలో విఫలం అవుతున్నారు. పోలీసులు అడపాదడపా పశువుల యజమానులను పిలిచి హెచ్చరిస్తున్నా ఫలితం లేకుండాపోయింది. పాడిపశువులను పెంచుకుతున్న సమీప గ్రామాల ప్రజలు వాటిని అటవీప్రాంతంలో తోలకుండా వదిలేస్తున్నారు. అవి హైవేపై సంచరిస్తూ వాహన చోదకులకు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్ని పశువులైతే మేసిన మేతను నెమరవేసుకుంటూ దర్జాగా రోడ్లపై మందలుగా వెళ్తున్నాయి. హారన్ కొట్టినా అవి కదలడంలేదు. దీంతో వాహన చోదకులు విసిగిపోతున్నారు. పొరపాటున వాహనం తగిలితే తిరిగి వారిపైనే కేసులు నమోదుచేసి స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. దీంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. పశువులను హైవేపై రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. యజమానులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


హైవే డివైడర్లలో సంచరిస్తున్న పశువులు


బాధిత కుటుంబానికి రూ.5.5 లక్షల నగదు అందజేస్తున్న మంత్రి సవిత

## కార్యకర్తలకు టీడీపీ అండ: మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని నిమ్మకాయల రామాంజి కుటుంబానికి మంత్రి సవిత భరోసా ఇచ్చారు. సోమందేపల్లి మండలంలో టీడీపీ కార్యకర్త రామాంజి 2019లో గ్రామంలో రూ.5.50లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం రాగానే బిల్లురాకుండాచేసి పార్టీలోకి రావాలని వేధింపులకు గురిచేశారన్నారు. రామాంజి ఆర్థికంగా కుంగిపోయి అప్పులపాలై అనారోగ్యంతో మృతిచెందాడు. మంత్రి సవిత విషయం తెలుసుకుని ఆయన కుటుంబాన్ని పరామర్శించి పెండింగ్‌లో ఉన్న రూ.5.5లక్షల బిల్లును మంజూరు చేయించి బుధవారం పార్టీ కార్యాలయంలో రామాంజి భార్య రత్నమ్మకు నగదును అందించారు.

## యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: కలెక్టర్


జటాయువు పక్షివద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

లేపాక్షి, మే21(ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని, ప్రతిరోజూ యోగాను దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ చేతన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ఈనెల 21నుంచి జూన్ 21వరకు యోగా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో యోగా దినోత్సవాన్ని లేపాక్షిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి అనుకూలమైన స్థలాన్ని పరిశీలించడానికి ఆయన లేపాక్షి ప్రధాన ఆలయం, నందివిగ్రహం, జటాయువు పక్షి ప్రాంగణం, నవోదయ పాఠశాలను పరిశీలించారు. ప్రస్తుతం ప్రతిరోజూ ప్రజలు, ఉద్యోగులుయోగా నిర్వహించేందుకు నవోదయ పాఠశాలలో ఏర్పాట్లు చేశారు. జూన్ 21న యోగా నిర్వహించే స్థలాన్ని త్వరలో వెల్లడిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, ఎస్ఐ నరేంద్ర పాల్గొన్నారు.

## ఘనంగా తిరంగా ర్యాలీ


బస్టాండు వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

అగళి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలో బీజేపీ మండల అధ్యక్షురాలు విక్టోరియా రాణి ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. శంకర ఈశ్వరస్వామి దేవాలయం నుంచి పురవీధులగుండా ర్యాలీ కొనసాగింది. అనంతరం బస్టాండ్ ఆవరణంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా మన దేశ సైన్యానికి మద్దతుగా, జవాన్ మురళినాయక్ ఆత్మశాంతి చేకూరాలని మౌనం పాటించారు. బీజేపీ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి, జనసేన మండల అధ్యక్షుడు రమేష్, డిస్ట్రిక్ట్ టీచర్స్ అసోసియేషన్ నాయకుడు లక్ష్మీనారాయణ, మడకశిర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మఠం లక్ష్మీనారాయణగుప్తా, గోవిందప్ప, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ శివరాం దొడ్డ, రంగేగౌడ్, వెంకటేశ్, మంజునాథ్, రఘురాం, జయన్న, గోవిందరాజులు, రంగనాథ్ పాల్గొన్నారు.

## ఆర్డీటీని పరిరక్షించండి


గోరంట్ల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

గుడిబండ, మే 21(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే ఆర్డీటీని పరిరక్షించాలని సర్పంచ్ కరుణాకర్‌గౌడ్ కోరారు. బుధవారం పేద ప్రజలతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. సేవ్ ఆర్డీటీ కార్యక్రమంపై ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఆర్డీటీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

గోరంట్ల: మండలంలోని పులేరు గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యుల్ చేయాలని తహసీల్దార్ మారుతీకి బుధవారం వినతిపత్రం అందించారు. పేదల ప్రజల అభ్యున్నతికోసం ఆర్డీటీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. అలాంటి సంస్థను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. నాగమ్మ, శివమ్మ, ప్రకాష్, క్రిష్టప్ప పాల్గొన్నారు.

## వీర జవాన్ కుటుంబాన్ని కలిసిన చిత్రకారుడు



వీర జవాన్ చిత్రపటాన్ని అందిస్తున్న ఆర్టిస్టు పల్లి చిరంజీవి

గోరంట్ల, మే21 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన జాతీయ కళాశ్రీ అవార్డు గ్రహిత మైక్రో ఆర్టిస్టు పల్లి చిరంజీవి వీరజవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని బుధవారం కలిశారు. మండలంలోని కళ్లితండాకు వెళ్లి మురళీనాయక్ తల్లిదండ్రడులు జ్యోతిబాయి, శ్రీరాము నాయక్‌లను కలిశారు. కాటన్ క్లాత్‌పై తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కుంకుమతో ప్రత్యేకంగా రూపొందించిన మురళీనాయక్ అరుదైన చిత్రపటాన్ని వారికి అందించారు. జవాన్ తల్లిదండ్రులకు ధైర్యాన్ని ఇచ్చేందుకే ఇలా చేశానన్నారు.

## నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

పెనుకొండ, మే 21(ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవాలను పురస్కరించుకుని గురువారం నుంచి జూన్ 21వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు, ప్రభుత్వ ఉద్యోగులకు వివరించారు. అనంతరం యోగాంధ్ర ఫ్లెక్సీని ఆవిష్కరించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆడిటోరియంలో ప్రతిరోజూ ఉదయం 6-30నుంచి 7-30 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మునిసిపల్ కమిషనర్ సతీష్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

### జోరుగా ఆన్‌లైన్ మట్కా


సెల్‌ఫోన్‌కు వచ్చిన మట్కా మెసేజ్‌లు

పరిగి, మే 21(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా మట్కా యాప్‌లతో అమాయకులు డబ్బులు పోగొట్టుకుంటున్నారు. రోజుకూలీ నుంచి పారిశ్రామికవేత్త వరకు ఆన్‌లైన్ మట్కాకు బానిసవుతూ లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. రోజు గడిస్తేచాలు అంటూ కుటుంబ సభ్యులు అంటుంటారు. అలాంటి కుటుంబపెద్దే సంపాదించిన కూలి డబ్బులు ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతూ చిత్తవుతున్నాడు. ఇటువంటివారిపై పత్రికల్లో కథనాలు ప్రచురించినా ఆంధ్రప్రదేశ్‌లో క్రికెట్ బెట్టింగ్, మట్కా బ్యాన్‌చేసినా యాప్స్ ద్వారా బెట్టింగ్, మట్కా ఆడుతూ జేబులు గుల్లచేసుకుంటున్నారు. వీటిపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.